మనసులో మాట
KANCHARLA
నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం..
సంచలన తెలుగు దిన పత్రిక
కోస్తాంధ్ర
రాజమహేంద్రవరం | కాకినాడ | కోనసీమ
అమలాపురం | తణుకు | ఏలూరు | భీమవరం
శనివారం 28 నవంబర్ 2026 పేజీలు 16



రెండవ దశ గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారం నేటితో ముగింపు

- కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్

13

ట్రాఫిక్ రూల్స్ పై అవగాహనా కల్పించిన కాకినాడ ట్రాఫిక్ 1 పోలీసులు



10





రెండో విడత పంచాయతీ ఎన్నికలు..

- 10 మండలాల్లో 130 సర్పంచ్ 1,360 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు
- 25 సర్పంచ్, 446 వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవం
- సర్పంచ్ స్థానాలకు 356 మంది వార్డు సభ్యుల
- స్థానాలకు 2,928 మంది అభ్యర్థులు

రాజమహేంద్రవరం (మనసులో మాట) నవంబర్ 27 :

తూర్పు గోదావరి జిల్లా పరిధిలో రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నెల 29వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటల నుంచి ..మిగతా 3లో



రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల

- నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- ఈ నెల 29న పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలను ఎన్నికల
- పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్ల పై అధికారులకు దిశానిర్దేశం

14

ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు

- మూడు కౌంటింగ్ హాళ్లు, 132 టేబుళ్ల ఏర్పాటు
- ప్రతి టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్, ముగ్గురు సహాయకులు
- ఫలితాల నమోదు కోసం ప్రత్యేక డేటా ఆపరేటర్ల నియామకం
- మేయర్ అభ్యర్థికి ఒక జనరల్ ఏజెంట్‌కు అనుమతి
- వార్డు అభ్యర్థికి ఇద్దరు ఏజెంట్లు.. ఒక్కరికి మాత్రమే ప్రవేశం
- గుర్తింపు పాస్‌లు ఉన్నవారికే కౌంటింగ్ హాల్లోకి అనుమతి ఉదయం 6 గంటలకే ఏజెంట్లు స్ట్రాంగ్ రూమ్ వద్దకు చేరుకోవాలి
- ప్రాథమిక, సమగ్ర లెక్కింపు రెండు దశల్లో ఓట్ల లెక్కింపు



కాకినాడ(మనసులో మాట) నవంబర్ 27 :

కాకినాడ నగర పాలక సంస్థ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం రంగరాయ వైద్య కళాశాలలో నిర్వహించనున్న కౌంటింగ్ ఏర్పాట్లపై రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి, కౌంటింగ్ విధివిధానాలను వివరించారు.ఈ సందర్భంగా కమిషనర్ ..మిగతా 11లో



ఉప్పాడ, పొన్నాడ పంచాయతీల్లో 'జబర్దస్త్' నటుల ప్రచార సందడి

15



జిల్లా కోర్టు 222 ఏళ్లకు, బార్ అసోసియేషన్ 131 ఏళ్ల వేడుకల్లో పాల్గొననున్న

- సీఎం నారా చంద్రబాబు నాయుడు

11

వన గణపతికి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం

- ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్‌స్‌లో వన గణపతికి చోటు
- రెండేళ్ల శ్రమతో అద్భుత రూపకల్పన చేసిన రైతు దూలం ధనరాజ్

6



- నాలుగు మాల్వీజియా తీగజాతి మొక్కలతో గణపతి తయారీ
- సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జాతీయ స్థాయిలో ప్రచారం
- వివరాలు సేకరించి రికార్డుల్లో నమోదు చేసిన సంస్థ

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

భక్త కనకదాస చరిత్ర ప్రతిఒక్కరికీ ఆదర్శనీయం: కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు, నవంబర్ 27(మనసులో మాట)



భక్త కనకదాస జీవితం, ఆయన బోధనలు ప్ర తిఒక్కరికీ ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అన్నారు. సమాజంలో కులమతాల కంటే నిజమైన భక్తి, మానవత్వమే గొప్పవని తన జీవితంతో చాటిచెప్పిన మహనీయుడు భక్త కనకదాస అని కొనియాడారు.స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో శుక్రవారం భక్త కనకదాస జయంతి వేడుకల ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి భక్త కనకదాస చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళుల ర్పించారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భక్త కనక దాస ఆధునిక కవిగా, తత్వవేత్తగా, సంగీతకా రుడిగా, స్వరకర్తగా విశేష గుర్తింపు పొందారని తెలిపారు. 1509లో కర్ణాటక రాష్ట్రంలో జన్మిం చిన ఆయన 1609లో మరణించారని పేర్కొ న్నారు. సామాన్య ప్రజలకు సైతం సులభంగా అర్థమయ్యేలా కన్నడ భాషలో అనేక కీర్తనలు, కావ్యాలను రచించారని వివరించారు.నలచ రిత్ర, హరిభక్తిసార, మోహన తరంగిణి, రామ ధ్యాన చరిత్ర, నృసింహ స్తోత్రం వంటి ఎన్నో గొప్ప రచనలను అందించారని తెలిపారు. తన రచనలు, బోధనల ద్వారా భక్తి భావాన్ని ప్రజల్లో పెంపొందించడంతో పాటు సమాజంలో ఉన్న వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాడారని పేర్కొ న్నారు. కులమత భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ సమానంగా చూడాలని, నిజమైన భక్తి, మానవత్వం, సమానత్వమే సమాజానికి పునాదులని తన జీవితం ద్వారా సందేశమి చ్చారని కలెక్టర్ వివరించారు.భక్త కనకదాస ఆశయాలు, ఆలోచనలు నేటి సమాజానికి కూడా ఎంతో ప్రేరణనిస్తాయని, ఆయన జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కలెక్టర్ సూచించారు.

కౌంటింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎంపీడీఓ పి.వి.ఆర్.కె. రాజు

కొత్తపేట (మనసులో మాట) నవంబరు 27



అత్రేయపురం మండల పరిధిలోని వాడపల్లి, ర్యాలి, మెర్లపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఎన్ని కల కౌంటింగ్ కేంద్రాలను మండల పరిషత్ అభి వృద్ధి అధికారి పి.వి.ఆర్.కె. రాజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

కౌంటింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, కౌంటింగ్ నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లు, సిబ్బందికి కల్పించాల్సిన సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కౌంటింగ్ ప్రక్రియ ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంత వాతా వరణంలో, పూర్తి పారదర్శకతతో నిర్వహించేం దుకు ముందస్తు ఏర్పాట్లన్నీ పక్కాగా ఉండాలని సంబంధిత అధికారులకు సూచించారు.

కౌంటింగ్ విధులకు నియమితులైన అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన బాధ్యతలను సమ ర్థవంతంగా నిర్వర్తించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు,నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా అవసర మైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఏలూరు జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ హవా

- **177 పంచాయతీల్లో టీడీపీ 80, వైసీపీ 68, జనసేన 15 స్థానాల్లో విజయం**

ఏలూరు, నవంబర్ 27(మనసులో మాట)

ఏలూరు జిల్లాలో తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాల్లో తెలుగుదేశం పార్టీ ఆధిక్యం ప్ర దర్శించింది. జిల్లాలోని 11 మండలాల పరిధిలో మొత్తం 177 గ్రామ పంచాయతీలకు జరిగిన ఎన్నికల్లో టీడీపీ 80, వైఎస్సార్‌సీపీ 68, జనసేన 15 స్థానాల్లో విజయం సాధించాయి. ఇతరులు 8, సీపీఐ(ఎంఎల్) 3, బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ ఒక్కో స్థానంలో గెలుపొందాయి. చింతలపూడి మండలం ప్రగడవరం పంచాయతీని కూడా వైఎ స్సార్‌సీపీ కైవసం చేసుకోవడంతో మొత్తం 177 పంచాయతీల ఫలితాలు పూర్తయ్యాయి.

మండలాల వారీగా ఫలితాలను పరిశీలిస్తే బు ట్టాయగూడెం మండలంలో మొత్తం 21 పంచా యతీలకు గాను టీడీపీ, వైసీపీ చెరో 8 స్థానాలు సాధించగా, జనసేన ఒకటి, ఇతరులు నాలుగు స్థానాల్లో విజయం సాధించారు.జంగారెడ్డిగూడెం మండలంలో 20 పంచాయతీలకు గాను వైసీపీ 11, టీడీపీ 5, జనసేన 4 స్థానాలను కైవసం చేసు కున్నాయి. జీలుగుమిల్లి మండలంలో 12 పంచా యతీలకు గాను వైసీపీ 6, టీడీపీ 5, ఇతరులు ఒక స్థానంలో గెలుపొందారు.

కామవరపుకోట మండలంలో 15 పంచాయ తీలకు గాను వైసీపీ 8, టీడీపీ 6, జనసేన ఒక స్థానంలో విజయం సాధించాయి. కొయ్యలగూ డెం మండలంలో 18 పంచాయతీలకు గాను టీడీపీ, జనసేన చెరో 6 స్థానాలు, వైసీపీ 4, ఇతరులు 2 స్థానాలను దక్కించుకున్నారు. కు క్కునూరు మండలంలో మొత్తం 15 పంచాయతీ లకు గాను టీడీపీ 9, వైసీపీ 6 స్థానాల్లో విజయం సాధించాయి.

పోలవరం మండలంలో 11 పంచాయతీలకు గాను టీడీపీ 6, వైసీపీ 2, జనసేన ఒకటి, సీపీ ఐ(ఎంఎల్) ఒకటి, ఇతరులు ఒక స్థానంలో గెలుపొందారు. టి.నరసాపురం మండలంలో 15 పంచాయతీలకు గాను టీడీపీ, వైసీపీ చెరో 6 స్థానాలు సాధించగా, జనసేన, బీజేపీ, కాంగ్రెస్ ఒక్కో స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. వేలేరుపా డు మండలంలో 9 పంచాయతీలకు గాను టీడీపీ, వైసీపీ చెరో 3 స్థానాలు, సీపీఐ(ఎంఎల్) 2, సీపీఐ ఒక స్థానంలో విజయం సాధించాయి.

చింతలపూడి మండలంలో మొత్తం 19 పంచా యతీలకు గాను టీడీపీ 10, వైసీపీ 8, జనసేన ఒక స్థానంలో గెలుపొందాయి. తొలుత ప్రగ డవరం పంచాయతీ కౌంటింగ్ కొనసాగగా, చివరకు వైసీపీ అభ్యర్థి విజయం సాధించడం తో ఆ పార్టీ ఖాతాలో మరో స్థానం చేరింది. లింగపాలెం మండలంలో 22 పంచాయతీలకు గాను టీడీపీ 16, వైసీపీ 6 స్థానాలను కైవసం చేసుకున్నాయి.

రైతులకు మంచి జరిగేలా చూస్తాం



తాడేపల్లిగూడెం (మనసులో మాట) నవంబర్ 27 :

తుఫాన్లు బారిన పడి నష్టపోయిన రైతాంగానికి మంచి జరిగేలా చూస్తామని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ రైతులకు భరోసాని ఇచ్చారు. శుక్రవారం తాడేపల్లి గూడెం క్యాంపు కార్యాలయం వద్ద పలువురు రైతులు ఎమ్మెల్యే ను కలిసి తమ ఆవేదన వినిపిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక తుఫాను ఈదురు గాలులతో నూ... మరో తుఫాను పంటను నీట ముంచిందన్నారు. దీంతో రైతులు పూర్తిగా నష్టపోయారన్నా రు.రైతుల దుస్థితిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. త్వరలోనే రైతులకు మంచి జరుగుతుంద న్నారు. ముందుగా రైతులు కోసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించి రసీదు పొందాలన్నారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి నేకూరి కిరణ్ కుమార్ ఎంపీపీ బేదపూడి వెంకటేశ్వరరావు,సొసైటీ చైర్మన్లు, రైస్ మిల్లర్లు ఉన్నారు.

రావులపాడులో కూటమి సర్పంచ్ అభ్యర్థి పిచ్చెట్టి చిన్నారావుకు మద్దతుగా ఏపీ బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంత కుమారి ప్రచారం



కొత్తపేట (మనసులో మాట) నవంబర్ 27

రావులపాలెం మండలం రావుల పాడు గ్రామంలో కూటమి టీడీపీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పిచ్చెట్టి చిన్నారావుకు మద్దతుగా ఏపీ బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంత కుమారి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటిస్తూ కూటమి అభ్యర్థి కత్తెర గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించా లని ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో స్థానిక నాయకులు, కూటమి శ్రేణులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అభ్యర్థికి మద్దతు గా ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఎన్నికల ప్రచారం ఉత్సాహభరితంగా సాగింది.

రోడ్లు... డ్రెయినేజీ సమస్య పరిష్కరిస్తా...!



తాడేపల్లిగూడెం (మనసులో మాట) నవంబర్ 27:

గ్రామంలోని రోడ్లు,డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని సర్పంచ్ అభ్యర్థి యలమాటి శ్రీదేవి తెలిపారు. శుక్రవారం తాడేపల్లిగూడెం మండలం నీలా ద్రిపురంలో ఆమె వీడియోతో మా ట్లాడారు. అంబేద్కర్ కాలనీలో గొంతేలమ్మ ఆలయాన్ని నిర్మిం చాలని స్థానికులు కోరారని, అవ సరమైతే తన సొంత నిధులతో నిర్మాణం చేపడతామన్నారు. కూటమి నాయకుడు యలమాటి సత్యనారాయణ, ఎంపీటీసీ హేమ సుధ పాల్గొన్నారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర కమిషన్ చైర్మన్
- వేటుకూరి సూర్యనారాయణ రాజు



రాజమహేంద్రవరం (మనసులో మాట) నవంబర్ 27

బాల్య వివాహం అనే సాంఘిక దురాచారాన్ని పూర్తిగా నిర్మూలించి, 2030 నాటికి బాల్య వివాహాలు లేని భారతదేశాన్ని నిర్మించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' కార్యక్రమంలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా స్థాయి బాల్య వివాహ వ్యతిరేక దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

శుక్రవారం రాజమహేంద్రవరంలోని ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో క్రాఫ్ స్వచ్ఛంద సంస్థ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ బాల్య వివాహాలు అనే సాంఘిక దురాచారాన్ని దేశం నుంచి పూర్తిగా నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా రాష్ట్రాలు, జిల్లాల స్థాయిలో సమన్వయం తో కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడటమే కాకుండా, వారి విద్య, మానసిక వికాసం, భవిష్యత్తుపై ప్రతికూల పరిణామాలు ఏర్పడతాయని వివరించారు. బాల్య వివాహాల వల్ల ఎదురయ్యే ఆరోగ్యపరమైన, చట్టపరమైన సమస్యలను వివరిస్తూ, వాటి నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. బాలల హక్కుల గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, బాలలు తమ హక్కులను సద్వినియోగం చేసుకుంటూ విద్యలో రాణించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఎక్కడైనా బాలల హక్కులకు భంగం కలిగినా, బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే 1098, 112, 100 హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం అందించి బాలల రక్షణ, సంక్షేమం, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

కేంద్ర ప్రభుత్వం 2024 నవంబర్ 27న ఢిల్లీలో 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి, 2030 నాటికి బాల్య వివాహాలు లేని దేశంగా భారతదేశాన్ని తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రతి సంవత్సరం 100 రోజుల ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 2026 సెప్టెంబర్ 4న నవంబర్ 27వ తేదీని బాల్య, ప్రారంభ బలవంతపు వివాహాల నిర్మూలన కోసం అంతర్జాతీయ దినోత్సవం'గా ప్రకటిస్తూ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించింది.

ఈ కార్యక్రమం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సాధికారిక అధికారి తోట శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించగా, ప్రాంతీయ ఇంటర్మీడియట్ విద్యాధికారిణి ఐ. శారద, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి. కోమలి, జిల్లా బీసీ సంక్షేమ అధికారిణి బి. శశాంక, రాజమహేంద్రవరం అర్బన్ సీడీపీఓ వాణి, ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ రెహమాన్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ప్రదీప్, డీసీపీయూ సిబ్బంది, క్రాఫ్ ఎన్జీవో కోఆర్డినేటర్ బి. రాజ్ కుమార్, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు

(మొదటి పేజీ తరువాయి)



మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లుఅనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభించ నున్నట్లు శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయం తో పనిచేయాలని సూచించారు. జిల్లాలో రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు రాజమహేంద్రవరం, కొవ్వూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 10 మండలాల్లో నిర్వహించనున్నారు. రాజమహేంద్ర

వరం డివిజన్ పరిధిలో అనపర్తి, బిక్కవోలు, గోకవరం, మండపేట, రంగంపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలు, కొవ్వూరు డివిజన్ పరిధిలో దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ పది మండలాల్లో మొత్తం 155 సర్పంచ్ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ చేపట్టగా, 25 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 130 సర్పంచ్ స్థానాలకు పోలింగ్ జరగనుండగా, మొత్తం 356 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

మండలాల వారీగా సర్పంచ్ స్థానాల వివరాలు పరిశీలిస్తే అనపర్తిలో 11 స్థానాలకు గాను 3 ఏకగ్రీవం కాగా 8 స్థానాలకు 30 మంది, బిక్కవోలులో 13 స్థానాలకు 7 ఏకగ్రీవం కాగా 6 స్థానాలకు 18 మంది, గోకవరంలో 14 స్థానాలకు 31 మంది, మండపేట లో 12 స్థానాలకు 38 మంది, రంగంపేట లో 17 స్థానాలకు ఒకటి ఏకగ్రీవం కాగా 16 స్థానాలకు 39 మంది, రాయవరం లో 12 స్థానాలకు ఒకటి ఏకగ్రీవం కాగా 11 స్థానాలకు 37 మంది, కపిలేశ్వరపురం లో 19 స్థానాలకు 6 ఏకగ్రీవం కాగా 13 స్థానాలకు 31 మంది, దేవరపల్లిలో 15 స్థానాలకు 2 ఏకగ్రీవం కాగా 13 స్థానాలకు 38 మంది, గోపాలపురం లో 18 స్థానాలకు 2 ఏకగ్రీవం కాగా 16 స్థానాలకు 47 మంది, నల్లజర్లలో 24 స్థానాలకు 3 ఏకగ్రీవం కాగా 21 స్థానాలకు 47 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

అదే విధంగా జిల్లాలోని పది మండలాల పరిధిలో మొత్తం 1,806 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికల ప్రక్రియ చేపట్టగా, 446 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 1,360 వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఈ స్థానాలకు మొత్తం 2,928 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.మండలాల వారీగా అనపర్తిలో 140 వార్డులకు 57 ఏకగ్రీవం కాగా 83 స్థానాలకు 183 మంది, బిక్కవోలు లో 158 వార్డులకు 94 ఏకగ్రీవం కాగా 64 స్థానాలకు 132 మంది, గోకవరంలో 166 వార్డులకు 17 ఏకగ్రీవం కాగా 149 స్థానాలకు 335 మంది, మండపేటలో 156 వార్డులకు 13 ఏకగ్రీవం కాగా 143 స్థానాలకు 296 మంది, రంగంపేటలో 190 వార్డులకు 17 ఏకగ్రీవం కాగా 173 స్థానాలకు 358 మంది, రాయవరంలో 148 వార్డులకు 27 ఏకగ్రీవం కాగా 121 స్థానాలకు 268 మంది, కపిలేశ్వరపురం లో 210 వార్డులకు 94 ఏకగ్రీవం కాగా 116 స్థానాలకు 240 మంది, దేవరపల్లిలో 182 వార్డులకు 36 ఏకగ్రీవం కాగా 146 స్థానాలకు 323 మంది, గోపాలపురం లో 198 వార్డులకు 38 ఏకగ్రీవం కాగా 160 స్థానాలకు 360 మంది, నల్లజర్లలో 258 వార్డులకు 53 ఏకగ్రీవం కాగా 205 స్థానాలకు 433 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.పోలింగ్ నిర్వహణకు అవసరమైన సిబ్బందిని ముందుగానే కేటాయించి, వారికి ఎన్నికల విధులపై తగిన సూచనలు, శిక్షణ అందించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులు సకాలంలో చేరవేయాలని, పోలింగ్ సిబ్బందికి రవాణా, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించు కునేలా పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను నిబంధనల ప్రకారం ప్రకటించనున్నట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించి రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కీర్తి చేకూరి కోరారు

కర్మాగారాల యజమానులు తప్పనిసరిగా

- **రాజమహేంద్రవరం (మనసులో మాట) నవంబర్ 27**



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని కర్మాగారాల యజమానులు తమ కర్మాగారాల కు సంబంధించిన ప్రొఫైల్‌ను ప్రభుత్వ కర్మాగారాల శాఖ అధికారిక వెబ్‌సైట్ factories.ap.gov.in లో తప్పని సరిగా నమోదు చేసుకోవాలని కర్మాగారాల ఉప ముఖ్య తనిఖీ అధికారి మరియు కర్మాగారాల తనిఖీ అధికారి కే. కృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ ప్రక్రియను 2026 డిసెంబర్ 31 వ తేదీలోపు పూర్తి చేయాలని సూచించారు. ప్రొఫైల్ నమోదు, ఫీజుల చెల్లింపునకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే 9966474657 మొబైల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 2027 సంవత్సరానికి చెల్లించవలసిన కర్మాగారాల లైసెన్స్ ఫీజుల్లో మార్పులు చేసినందున, యాజమాన్యాలు తమ కర్మాగారాల కు వర్తించే లైసెన్స్ ఫీజు వివరాలను జతపరిచిన పట్టిక ద్వారా సరిచూసు కోవాలని సూచించారు. నిర్ణీత లైసెన్స్ రుసుమును 2026 డిసెంబర్ 31వ తేదీలోపు సి ఎఫ్ ఎం ఎస్ లేదా ఫాక్టోరీస్ పోర్టల్ ద్వారా తప్పనిసరిగా చెల్లించాలని స్పష్టం చేశారు. లైసెన్స్ ఫీజు చెల్లింపునకు సంబంధించి హెడ్ ఆఫ్ అకౌంట్, డీడీఓ కోడ్‌లలో ఎలాంటి మార్పులు లేవని తెలిపారు. కర్మాగారాల్లో అదనంగా హార్స్ పవర్ యంత్రాలను ఏర్పాటు చేసినా, అదనపు కార్మికులను నియమించినా పెరిగిన సామర్థ్యం, కార్మికుల సంఖ్యకు అనుగుణంగా వర్తించే అదనపు లైసెన్స్ ఫీజు బకాయిని చెల్లించాలన్నారు. అదేవిధంగా ఆక్యుపైయర్ బదిలీ, కర్మాగారం పేరు మార్పు జరిగిన సందర్భాల్లో లైసెన్స్ బదిలీ లేదా సవరణల కోసం సంబంధిత దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

నిర్ణీత గడువు లోగా సరిపడా లైసెన్స్ రుసుము చెల్లించకపోతే, చెల్లించాల్సిన రుసుము పై అదనంగా నెలకు రెండు శాతం వడ్డీ విధించబడుతుందని హెచ్చరించారు. లైసెన్స్ ఫీజులు చెల్లించని కర్మాగారాల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు, చెల్లుబాటు అయ్యే లైసెన్స్ లేకుండా కర్మాగారాలను నిర్వహించే యాజమాన్యాల పై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కే. కృష్ణమూర్తి స్పష్టం చేశారు

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

ఒక్క అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తా సర్పంచ్ అభ్యర్థిని ఇండుగుల వెంకటలక్ష్మి

అమలాపురం(మనసులో మాట) నవంబర్ 27:



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం నేదునూరు గ్రామపంచాయతీ అభ్యర్థినిగా పోటీ చేస్తున్న ఇండుగుల వెంకటలక్ష్మి తన ప్రచారాన్ని ఆఖరి రోజు అయిన శుక్రవారం గ్రామం అంతా విస్తృత పర్యటించి జోరుగా తన ప్రచారాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మనసులో మాట దినపత్రిక అంబేధ్కర్ కోనసీమ జిల్లా ప్రతినిధి తో వెంకటలక్ష్మి భర్త ఇండుగుల వెంకటరామయ్య మాట్లాడారు

తన రాజకీయ అనుభవంతో రైతులకు మేలు :

తాను గత 30 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీలో సీనియర్ నాయకుడిగా ఉంటూ గ్రామంలో నీటి సంఘం సొసైటీ పదవులు నిర్వహించి రైతులకు ఎంతో మేలు కరమైన పనులు చేయడం జరిగిందన్నారు. అలాగే నేదునూరు 2 ఎంపీటీసీగా తన బాధ్యతలు నిర్వహిస్తూ ఎంపిటిసి పరిధిలో పలు రోడ్లు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. నేదునూరు గ్రామపంచాయతీ సర్పంచ్ గా బాధ్యతలు చేపట్టి పూర్తిస్థాయిలో గ్రామ అభివృద్ధి చేపట్టాలనేది తన చిరకాల కోరికన్నారు. ఈ నేపథ్యంలో 2017లో సర్పంచ్ అభ్యర్థిగా నేను పోటీ చేసినప్పటికీ గ్రామ ప్రజలు నాకు అవకాశం ఇవ్వలేదన్నారు.

సర్పంచ్ గా అవకాశం

ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తా:

గ్రామ అభివృద్ధి కోసం నేను ఎప్పటికైనా సర్పంచ్ గా విజయం సాధించి అభివృద్ధి చేయాలనేదే నా కోరిక అన్నారు. అయితే అది నా భార్య వెంకట లక్ష్మి ప్రస్తుతం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తుందని,ఈసారి నాభార్య కు సర్పంచ్ గా గ్రామ ప్రజలు అవకాశం కల్పిస్తే నేదునూరు గ్రామాన్ని నా భార్య ద్వారా అభివృద్ధిలో రూపురేఖ లు మారుస్తా నన్నారు.ప్రస్తుతం గ్రామంలో తాను సొంత సొమ్ములతో కొన్ని సమస్యలు పరిష్కరించడం జరిగిందన్నారు.

సొంత సొమ్ముల తో పలు అభివృద్ధి పనులు:

గ్రామ ప్రజల కోరిక మేరకు నేదునూరు పెదపేట గ్రామంలో ఎలిమెంటరీ స్కూల్ వద్ద పాఠశాల పంట షెడ్డు ను, అలాగే గ్రామంలో స్మశాన వాటిక వద్ద పాంచాల రేవును తన సొంత సొమ్ములతో నిర్మించడం జరిగిందన్నారు. అయితే స్మశాన వాటిక చుట్టూ పెనషింగ్ తో పాటు స్మశానానికి వచ్చే వారికి స్నానమాచరించడానికి ప్రత్యేక ఏర్పాట్లు ,స్మశాన వాటిక అభివృద్ధి లాంటి కార్యక్రమాలు చేయాలంటే పంచాయతీ సర్పంచ్ గా అవకాశం కల్పిస్తే వాటన్నిటిని పూర్తిచేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

అలాగే గ్రామంలో ఉన్న పది యామ్లెట్లలో ఇంకా అభివృద్ధికి సోచుకోనటువంటి రోడ్లు తాగునీటి సదుపాయం తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు తన భార్య ద్వారా చేపట్టడం జరుగుతుందని వెంకటరామయ్య పేర్కొన్నారు.

నేదునూరు పెద్ద చెరువు పంచాయతీకి

ఆదాయ వనరుగా మారుస్తా :

నేదునూరు గ్రామం మధ్యలో ఉన్న పెద్ద చెరువు గత పదిహేనేల్లుగా నిరుప్రయోగంగా ఉందని ఈ చెరువు ఆర్డబ్ల్యూఎస్ కు అప్పగించగా అభివృద్ధి కోసం గతంలో 10 కోట్ల రూపాయలు నిధులు ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ ఆ నిధులు కొన్ని కారణాలతో ఆగిపోయాయన్నారు. అప్పటినుండి మూడు దఫాలుగా సర్పంచ్లు వచ్చినప్పటికీ చెరువు అభివృద్ధికై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. తన భార్య వెంకట లక్ష్మి కి సర్పంచ్ గా ప్రజలు అవకాశం కల్పిస్తే చెరువు అభివృద్ధితో పాటు పంచాయతీకి చెరువును ఆదాయ వనరుగా తీర్చిదిద్దు తానని ఆయన పేర్కొన్నారు. అలాగే గ్రామంలో ఈ పెద్ద చెరువు వల్ల గతంలో అనేక ఉపయోగాలకు ఊరి ప్రజలు తమ అవసరాలు తీర్చుకునే వారిని ప్రస్తుతం ఇవన్నీ మరుగున పడ్డాయ న్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నిధులతో నిర్మిస్తున్న జల జీవన స్కీములో ధవలేశ్వరం వద్ద నిర్మిస్తున్న వాటర్ స్టోరేజ్ నుండి కోనసీమ వ్యాప్తంగా అన్ని గ్రామాలకు పైపులు ద్వారా సురక్షిత మైన త్రాగనీరు ఆయా గ్రామాల కులాయి ఓవర్ హెడ్ ట్యాంకులకు సప్లై చేయడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే కొన్ని గ్రామాలకు పైప్లైన్ నిర్మిస్తున్నారని వాటి ద్వారా నేదునూరు గ్రామంలో మిగిలిన ప్రాంతాల్లో త్రాగునీరు సప్లై పూర్తిగా అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. అలాగే పార్టీలకు కులాలకు మతాలకు అతీతంగా గ్రామ అభివృద్ధికి తన భార్య ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని వెంకట్రామయ్య పేర్కొన్నారు. అలాగే గ్రామంలో పారిశుద్యం పై ప్రత్యేక దృష్టి పెట్టి గ్రామంలో శుభ్రత పాటించే విధంగా చర్యలు తీసుకోబడుతుందని ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాల శుభ్రత అత్యంత అవసరమన్నారు.



ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ వీడియోలు భద్రపరచాలి

- **పెన్డ్రైవ్లలో భద్రపరచాలని రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశం**
- **ఈ నెల 29న రెండో విడత పంచాయతీ ఎన్నికలు**

ఏలూరు, నవంబర్ 27 (మనసులో మాట)



జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు ప్రక్రియలకు సంబంధించిన వీడియోలను పెన్డ్రైవ్లలో భద్రపరచాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో రెండో, మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై శుక్రవారం రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బందితో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండో విడతలో ఏలూరు డివిజన్ పరిధిలోని కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి, భీమడోలు, నిడమర్రు, ఉంగుటూరు మండలాలతో పాటు జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలోని ద్వారకాతిరుమల మండలంలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ విడతలో మొత్తం 194 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, 1,972 వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఇప్పటికే 34 సర్పంచ్, 753 వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవమయ్యాయని వెల్లడించారు.

లొల్ల గ్రామ సర్పంచ్ అభ్యర్థి కాయల జగన్నాథం ముమ్మరంగా ప్రసారం



కొత్తపేట(మనసులో మాట) నవంబర్ 27

ఆత్రేయపురం మండలంలో అల్లా గ్రామం సర్పంచ్ అభ్యర్థిగా కాయల జగన్నాథం ఉమ్మరంగా ప్రసారం సాగించారు. గ్రామంలోని వాటర్ లను కత్తెర గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను ఓట్ల అభ్యర్థించారు. గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని మౌలిక వసతులకు త్రాగునీరు, డ్రైనేజీ, మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని అన్నారు.

22 గ్రామాల్లో ఎన్నికలకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం

- **పోలింగ్ సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు పూర్తి.. ఎన్నికల నిర్వహణకు సన్నద్ధమైన సిబ్బంది**
- **సర్పంచ్ స్థానాలకు 52 మంది, వార్డు సభ్యుల స్థానాలకు 350 మంది అభ్యర్థులు పోటీ**
- **ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా ఎన్నికల సహాయ అధికారి, ఎంపీడీవో జె. రాంబాబు**

కాజులూరు, (మనసులో మాట)నవంబర్ 27:



గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు కాజులూరు మండలంలో అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. రెండో విడతలో భాగంగా మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. పోలింగ్ ప్రక్రియలో కీలకమైన ఎన్నికల సామగ్రి పంపిణీకి అధికారులు రంగం సిద్ధం చేశారు. కాజులూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, అక్కడ అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించారు. ఎన్నికల విధులకు హాజరయ్యే ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రి అందజేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ కేంద్రాల వారీగా సామగ్రిని క్రమబద్ధీకరించి పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

సర్పంచ్ స్థానాలకు 52 మంది అభ్యర్థులు

మండలంలోని 22 గ్రామ పంచాయతీలకు సంబంధించి సర్పంచ్ ఎన్నికల్లో 52 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అలాగే 170 వార్డు సభ్యుల స్థానాలకు 350 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. మూడు గ్రామ పంచాయతీల్లో వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవం కావడంతో మిగిలిన స్థానాల్లో ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. పోలింగ్ సామగ్రి పంపిణీ, సిబ్బంది కేటాయింపు, పోలింగ్ కేంద్రాలకు తరలింపు, ఎన్నికల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు దృష్టి సారించారు. ఈ ఏర్పాట్లను జిల్లా ఎన్నికల సహాయ అధికారి, కాజులూరు ఎంపీడీవో జె. రాంబాబు పర్యవేక్షించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది సమయపాలన పాటిస్తూ తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటిస్తూ పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. మొత్తంగా 22 గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తికావడంతో పోలింగ్ ప్రక్రియపై అధికార యంత్రాంగం దృష్టి కేంద్రీకరించింది. గ్రామీణ ప్రజాస్వామ్య ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. సామగ్రి పంపిణీ పరిశీలన డిప్యూటీ ఎంపీడీవో ముద్రగడ సత్యనారాయణమూర్తి, కార్యాలయ కార్య నిర్వహణ అధికారి రాపాక పద్మలత , కాజులూరు పంచాయతీ కార్యదర్శి కె ఈశ్వరి సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

ఒడిశా విద్యార్థుల కోసం 'ఎలిమెంట్స్ ఆఫ్ మోడ్రన్ ఫిజిక్స్' పుస్తకం ఆవిష్కరణ





రాజోలు(మనసులోమాట) నవంబరు 27:

ఒడిశా రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల పరిధిలో బీఎస్సీ ఫిజిక్స్ హానర్స్ చదువుతున్న విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన ప్రముఖ ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ పరిశోధకుడు డాక్టర్ విజయ్ సత్య ప్రసాద్ యర్రంశెట్టి రచించిన 'ఎలిమెంట్స్ ఆఫ్ మోడ్రన్ ఫిజిక్స్' పాఠ్యపుస్తకం ప్రచురితమైంది. మీరట్‌కు చెందిన ప్రముఖ విద్యా ప్రచురణ సంస్థ జై ప్రకాష్ నాథ్ పబ్లికేషన్స్ ఈ పుస్తకాన్ని ప్రచురించింది. ఒడిశా యూనివర్సిటీల సిలబస్‌కు అనుగుణంగా, ఆధునిక భౌతిక శాస్త్రంలోని క్లిష్టమైన అంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో రూపొందించినట్లు రచయిత తెలిపారు. ఈ పుస్తకం డిగ్రీ విద్యార్థులతో పాటు అధ్యాపకులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని విద్యావేత్తలు పేర్కొన్నారు. కాగా, డాక్టర్ యర్రంశెట్టి ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల్లోని ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ విద్యార్థుల కోసం మొత్తం 16 పుస్తకాలు రచించడం విశేషం.

నవంబర్ నెల పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

- **సోమవారం, మంగళవారాల్లో 1,91,716 మంది కి రూ.83.83 కోట్లకు పైగా లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ**



అమలాపురం (మనసులో-మాట) నవంబరు 27:

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో నవంబర్ నెల పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు. నవంబరు 30వ తేదీ సోమవారం మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభమై, సోమవారం, మంగళవారాల్లో రెండు రోజుల పాటు కొనసాగుతుందని శుక్రవారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు.

జిల్లాలో మొత్తం 1,91,716 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.83,83,87,500 పింఛన్ మొత్తాన్ని పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 3,652 మంది పింఛన్ పంపిణీ అధికారులు పాల్గొంటారని వెల్లడించారు. జిల్లాలోని 19 మండలాలు, 3 మున్సిపాలిటీల పరిధిలో ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ల ద్వారా పింఛన్ల పంపిణీ చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ పంపిణీ ప్రక్రియను పీడీ, డీఆర్‌డీఏ పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

ఈ నెలలో ఇప్పటికే పింఛన్ పొందుతున్న లబ్ధిదారులకు మాత్రమే పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు, కొత్త పింఛన్ల మంజూరు లేదని స్పష్టం చేశారు.

అర్హులైన పింఛన్ లబ్ధిదారులందరికీ నిర్ణీత రెండు రోజుల్లో పింఛన్ల పంపిణీ పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

గ్రామాల అభివృద్ధికి కూటమి అభ్యర్థులకు ప్రజల మద్దతు కోరుతున్నాం!

- **పల్లెల ప్రగతికి సమష్టిగా అడుగులు వేద్దాం**
- **గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యం**
- **కూటమి సీనియర్ నేత వాసంశెట్టి సత్యం**
- **ఆర్యవటంలో కూటమి అభ్యర్థుల తరపున విస్తృత ఎన్నికల ప్రచారం**



కాజులూరు (మనసులో మాట), నవంబర్ 27:

గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా కూటమి బలపరిచిన అభ్యర్థులకు ప్రజలు తమ మద్దతు అందించాలని కూటమి సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం విజ్ఞప్తి చేశారు. పల్లెల ప్రగతికి ప్రజాప్రతినిధులు, ప్రజలు సమష్టిగా ముందుకు సాగినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.

కాజులూరు మండలం ఆర్యవటం గ్రామంలో కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి చందాల వీర వెంకట సత్యనారాయణ (బాబి), వార్డు సభ్యుల అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ గురువారం కూటమి నాయకులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని పలు వార్డుల్లో పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. అభ్యర్థుల లక్ష్యాలు, గ్రామాభివృద్ధికి చేపట్టనున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి ద్వారానే రాష్ట్రం, దేశం ప్రగతి పథంలో ముందుకు సాగుతాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేసే నాయకత్వం గ్రామాలకు అవసరమని తెలిపారు.

ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులకు తమ మద్దతు తెలిపిన విషయాన్ని ప్రస్తావిస్తూ, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశం ఉందన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలు గ్రామ భవిష్యత్తుకు సంబంధించినవని, ప్రతి ఓటరు అభ్యర్థుల సేవాభావం, అభివృద్ధి ప్రణాళికలు, ప్రజలకు అందుబాటులో ఉండే తీరును పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు. ఆర్యవటం గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సర్పంచ్ అభ్యర్థి బాబి, వార్డు సభ్యుల అభ్యర్థులు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ, అవసరమైన అభివృద్ధి పనులకు ప్రాధాన్యత కల్పించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. గ్రామాభివృద్ధి అనేది ఒక్కరి బాధ్యత కాదని, అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని వివరించారు. రాజకీయాలకు అతీతంగా గ్రామ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ అభ్యర్థి బాబి (కత్తెర గుర్తు), వార్డు సభ్యుల అభ్యర్థులకు ప్రజలు తమ మద్దతు అందించాలని కోరారు.

ఈ ప్రచార కార్యక్రమంలో కాజులూరు ఎంపీపీ చందాల ఆదినారాయణ, కోట తాతబ్బాయి, డేగల సతీష్, పార్టీ సీనియర్ నాయకులు సనపల ధనరాజ్ కాదా సువర్ణ కుమారి, కాదా గణేష్ చందాల మల్లి బాబుతదితరులు పాల్గొన్నారు.

తనయుడు గెలుపుకు తండ్రి ప్రసారం

- **కొత్తపేటలో స్వతంత్ర అభ్యర్థిగా దేవపాటి రాజేంద్ర ప్రసాద్**
- **బుట్ట గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి**

కొత్తపేట(మనసులో మాట) నవంబర్ 27

కొత్తపేట గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల బరిలో స్వతంత్ర అభ్యర్థిగా దేవపాటి రాజేంద్ర ప్రసాద్ నిలిచారు. తనకు బుట్ట గుర్తు కేటాయించడంతో ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. దేవపాటి వెంకటేశ్వరరావు నామినేషన్‌ను అధికార పార్టీ కుట్రలతో తిరస్కరించారని, తన కుమారుడు దేవపాటి రాజేంద్ర ప్రసాద్‌ను స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిపినట్లు తెలిపారు.



ప్రజలు జరుగుతున్న పరిణామాలన్నింటినీ గమనిస్తున్నారని, ప్రజల నిర్ణయమే అంతిమమని పేర్కొన్నారు.

గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యత

సర్పంచ్‌గా అవకాశం కల్పిస్తే గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తానని, తాగునీటి సమస్యల పరిష్కారం, అంతర్గత రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, వీధి దీపాల ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ చూపుతానని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి గ్రామ సమస్యల పరిష్కారానికి పనిచేస్తానని పేర్కొన్నారు.

కొత్తపేట గ్రామ ప్రజల మద్దతుతో బుట్ట గుర్తుపై ఓటు వేసి తన తనయుడు దేవపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని దేవపాటి వెంకటేశ్వరరావు ఓటర్లను కోరారు .

సి. రాయవరం లో కూటమి అభ్యర్థి ఈపిని అత్యధిక మెజార్టీతో గెలిపించండి

- **ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల**

ఏలేశ్వరం (మనసులో మాట) నవంబర్ 27

కాకినాడ జిల్లాప్రత్తిపాడు నియోజక వర్గం ఏలేశ్వరం మండలం లో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యం లో శుక్రవారం ఏలేశ్వరం మండలం సీ.రాయవరం గ్రామం లో కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి ఈపి సీతా రాజబాబు ని గెలిపించాలని కోరుతూ ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ గ్రామం లో విస్తృతంగా పర్యటించి ప్రజలను ఓటర్లను అభ్యర్థించారు .ఈ సందర్భంగా గ్రామ ప్రజలను కలిసి కూటమి అభ్యర్థికి తమ అమూల్య మైన ఓటును వేసి అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో ఏలేశ్వరం మండల టిడిపి అధ్యక్షుడు జ్యోతుల పెదబాబు, ఏలేశ్వరం కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపాలకృష్ణ (గోపి) ఏలేశ్వరం మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మూది నారాయణ స్వామి కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు.



మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

గ్రామాల అభివృద్ధికి ట్రిపుల్ ఇంజిన్ సర్కార్ అవసరం





- **కేంద్రం, రాష్ట్రం, జిల్లా, గ్రామ స్థాయి నాయకత్వం సమన్వయంతోనే అభివృద్ధి**
- **కూటమి సర్పంచ్ అభ్యర్థులను గెలిపించండి.. జడ్పీ చైర్‌పర్సన్ చింతమనేని నవ్యశ్రీ**

కైకలూరు, నవంబర్ 27(మనసులో మాట)

మంచం ఒక కాలు మీద నిలబడదని, నాలుగు కాళ్లు ఉంటేనే స్థిరంగా ఉంటుందని, అదే విధంగా కేంద్ర, రాష్ట్ర, జిల్లా, గ్రామ స్థాయి నాయకత్వం సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాలు సమగ్రంగా అభివృద్ధి చెందుతాయని ఏలూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ చింతమనేని సాయి నవ్యశ్రీ అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

కైకలూరు నియోజకవర్గ పంచాయతీ ఎన్నికల పరిశీలకురాలిగా నియమితులైన జడ్పీ చైర్‌పర్సన్ చింతమనేని సాయి నవ్యశ్రీ శుక్రవారం ముదినేపల్లి, మండవల్లి తదితర గ్రామాల్లో కూటమి అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొత్త నాగేంద్ర (నాగబాబు), జడ్పీ వైస్ చైర్మన్ బొర్రా చలమయ్య, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావుతో కలిసి ప్రచారం నిర్వహించారు. ముదినేపల్లిలో కూటమి సర్పంచ్ అభ్యర్థి ఈ.డి.సుధాకర్‌కు, మండవల్లిలో కూటమి సర్పంచ్ అభ్యర్థి గూడూరు తేజ నాగ సాయి కుమార్ శర్మ (అయ్యప్ప శాస్త్రి)కు, వార్డు సభ్యుల అభ్యర్థులకు మద్దతుగా ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా నవ్యశ్రీ మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ స్థాయిలో తాము సమన్వయంతో పనిచేస్తున్నామని వివరించారు. గ్రామస్థాయి లోనూ కూటమి బలపరిచిన సర్పంచులు, వార్డు సభ్యులు ఎన్నికైతే అభివృద్ధి పనులు మరింత వేగంగా ముందుకు సాగుతాయని పేర్కొన్నారు. గత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమికి ప్రజలు అందించిన మద్దతును పంచాయతీ ఎన్నికల్లోనూ కొనసాగించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ప్రజలు తమ గ్రామాలకు అవసరమైన అభివృద్ధి పనులను నేరుగా నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఓటును వృథా చేయకుండా అభివృద్ధికి కృషి చేసే కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. విదేశాల్లో ఉన్నత అవకాశాలను వదులుకుని సొంత గ్రామ అభివృద్ధి లక్ష్యంతో ముందుకు వచ్చిన మండవల్లి అభ్యర్థి అయ్యప్ప శాస్త్రికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కొర్లపాడు ఇళ్ల స్థలాల లెవలింగ్ పనులను ఎన్నికల నియమావళి ముగిసిన వెంటనే పూర్తి చేసి, వచ్చే ఏడాదిలో లబ్ధిదారులకు అప్పగిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్న వయసులోనే జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన చింతమనేని సాయి నవ్యశ్రీ ప్రజాసేవలో చురుగ్గా పనిచేస్తున్నారని ప్రశంసించారు. గత రెండున్నరేళ్లలో కైకలూరు నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.78 కోట్లతో 90 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా రూ.85 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్లు, డ్రైనేజీ పనులు చేపట్టామన్నారు. మిగిలిన రెండున్నరేళ్లలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు గ్రామ పంచాయతీల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు.



రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు చేయాలి



- **నగదు, మద్యం పంపిణీ జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి.**

అమలాపురం (మనసులోమాట) నవంబరు 27:

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగే మండలాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అధికారి దుండి రాంబాబు సూచించారు.

జిల్లాలో రెండవ విడత ఎన్నికలు జరిగే 9 మండలాల్లో 27 మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు నిరంతరం పర్యటిస్తూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అభ్యర్థుల ప్రచారం శుక్రవారం సాయంత్రంతో ముగిసిందని పేర్కొన్నారు.

ఎన్నికల సందర్భంగా ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఎలాంటి నగదు, మద్యం పంపిణీ జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా శుక్రవారం ఆయన అయినవిల్లి, కొత్తపేట, రావులపాలెం, ఆలమూరు, రామచంద్రాపురం మండలాల్లో పర్యటించి పలు ప్రచార వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఎన్నికల పోలింగ్ ముగిసిన అనంతరం కౌంటింగ్ ప్రక్రియ, ఫలితాల ప్రకటన పూర్తయ్యే వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందని దుండి రాంబాబు స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

రెండో విడత పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు.





- **కలెక్టర్ ఎం. ఎన్. హరేందిర ప్రసాద్ .**

గండేపల్లి (మనసులో మాట) నవంబర్ 27:

రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి జగ్గంపేట మరియు గండేపల్లి మండలాల్లో అధికారులు పగలబందీగా ఏర్పాటు చేస్తున్నట్లు కాకినాడ కలెక్టర్ హరేందిర ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయాల్లో కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలించారు. ఈనెల 29వ తేదీన జరగనున్న రెండో విడత ఎన్నికల విధుల్లో పాల్గొనే పంచాయతీ సిబ్బంది తమ పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని, ఇప్పటివరకు దాదాపు 27 మంది సిబ్బంది ఓటు వేశారని తెలిపారు. పోలింగ్ 29వ తేదీన ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు స్థానిక ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు అన్నారు. ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం ఒంటిగంట నుండి పోలింగ్ ముగిసిన వెంటనే సిబ్బంది కౌంటింగ్ కేంద్రాలకు చేరుకుంటారు. మధ్యాహ్నం రెండు గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఫలితాలను త్వరగా వెల్లడించేందుకు వీలుగా ప్రతి వార్డుకు ఒక ప్రత్యేక టేబుల్ ఏర్పాటు చేశారు .వార్డు సభ్యులు మరియు సర్పంచ్ ఎన్నికల లెక్కింపును వేగంగా పూర్తి చేసి ఫలితాలను ప్రకటించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఫలితాలు వెల్లడించిన వెంటనే ఉప సర్పంచ్లను కూడా నియమించుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ సత్య రెడ్డి, ఏవో చందర్రావు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

రూ.10 వేల లంచం తీసుకుంటూ ఏలూరు అర్బన్ తహసీల్దార్ పట్టివేత

ఏలూరు, నవంబర్ 27(మనసులో మాట)



ఏలూరు అర్బన్ తహసీల్దార్ (ఎంఆర్ఓ) సత్తి వెంకట రవీంద్రనాథ్ రూ.10 వేల లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డారు. ఓ పని నిమిత్తం బాధితుడి నుంచి ఆయన లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు రావడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వలపన్ని ఆయనను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.బాధితుడి నుంచి రూ.10 వేల నగదు లంచంగా తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి రవీంద్రనాథ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.లంచం డిమాండ్ చేసిన వ్యవహారంపై బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు ఈ చర్యలు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల పనులు నిబంధనల ప్రకారం పారదర్శకంగా జరగాలని భావిస్తున్న తరుణంలో తహసీల్దార్ స్థాయి అధికారి లంచం తీసుకుంటూ పట్టుబడటం ఏలూరు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

అయ్యప్ప మాలదారులు పాదయాత్రగా ఆంధ్రా శబరిమలకు.

శంఖవరం(మనసులో మాట).నవంబర్ 27:



పిఠాపురం, గొల్లప్రోలు మండలాలకు చెందిన అయ్యప్ప మాలదారులు పాదయాత్రగా శంఖవరం మండలంలోని సిద్ధి వారి పాలెం లో గల ఆంధ్రా శబరిమలై కు చేరుకున్నారు. ఆలయ చైర్మన్ కుసుమంచి శ్రీనివాసరావు గురుస్వామి అయ్యప్ప భక్తుల చేత స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా ఆంధ్రా శబరిమలై నిత్యం శరణ ఘోషతో ప్రతి ధ్వనిస్తుంది. రాష్ట్రం నలుమూలల నుండి అధిక సంఖ్యలో భక్తులు ఆంధ్రా శబరిమలై తరలివచ్చి స్వామి వారి సేవలో తన్మయం పొందుతారు. ఆలయ చైర్మన్ కుసుమంచి శ్రీనివాసరావు గురుస్వామి ప్రతి బుధవారం భక్తులకు అన్న ప్రసాదం కల్పిస్తున్నారు.

వన గణపతి కి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం

కడియం (మనసులో మాట) నవంబర్ 27



కేవలం మొక్కల తో 9 అడుగుల ఎత్తులో తయారు చేసిన వన గణపతి కి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు దక్కింది. ఈ మేరకు తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం పొట్టిలంక గ్రామానికి చెందిన మురుగన్ నర్సరీ రైతు దూలం ధనరాజ్ కు ద్రవ పత్రాలు అందాయి.పంజాబ్ రాష్ట్రానికి చెందిన ఈ సంస్థ కొరియర్ ద్వారా వీటిని పంపించారు. రెండేళ్ల పాటు శ్రమించి ఆ రైతు ఈ అద్భుతమైన ఆకృతిని తయారు చేసిన సంగతి తెలిసిందే. కేవలం నాలుగు మాల్ఫీజియా తీగజాతి మొక్కలతో ఈ గణేష్ ఆకృతిని తయారు చేయడం సోషల్ మీడియా లో వైరల్ అవ్వడంతో పాటు జాతీయ స్థాయి మీడియాలో వార్తలు వెలువడ్డాయి. దీంతో ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ వారు ఈ మొక్కకు సంబంధించి వివరాలు సేకరించారు. ఈ మొక్కను ఈ బుక్ ఆఫ్ రికార్డులో పొందుపరిచారు. నర్సరీ రైతు దూలం ధనరాజు ఈ మొక్కను జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కార్యాలయం కు అందజేయాలని ఆశించారు. అయితే ఆ సమయంలో పవన్ కళ్యాణ్ చికిత్స నిమిత్తం కేరళలో ఉండి పోవడం వల్ల ఆయన నుంచి తగిన స్పందన రాలేదు. మొత్తానికి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో నమోదు కావడం తో ఆ రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నారు

అమ్మవారి అన్నసంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్న....

- **వైసీపీ నాయకులు ఎముకుల డాక్టర్ రాము..**

మండపేట (మనసులో మాట) నవంబర్ 27

మండపేట పట్టణంలోని కొండపల్లి వారి వీధిలో నిర్వహించిన అమ్మవారి అన్నసంతర్పణ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఎముకుల డాక్టర్ రాము పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని కోరారు .అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి కార్యక్రమాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు డాక్టర్ రాముకు స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు, భక్తులు, కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

తిప్పరాజుపాలెం సమగ్ర అభివృద్ధే నా లక్ష్యం

- **గ్రామంలో పెండింగ్ సమస్యలన్నింటికీ పరిష్కారం చూపిస్తా**
- **అన్ని వర్గాల ప్రజల మద్దతుతో ఎన్నికల బరిలోకి చిక్కాల శ్రీనివాసరావు**



కాజులూరు (మనసులో మాట) నవంబర్ 27

తిప్పరాజుపాలెం గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడంతో పాటు, గ్రామంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరించడమే తన ప్రధాన లక్ష్యమని చిక్కాల శ్రీనివాసరావు స్పష్టం చేస్తున్నారు. గ్రామ ప్రజల అవసరాలు, ఆకాంక్షలను గుర్తించి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని తిప్పరాజుపాలెంకూటమి సర్పంచ్ అభ్యర్థి చిక్కాల శ్రీనివాసరావు తెలిపారు. ఆక్వా రైతుగా తిప్పరాజుపాలెం గ్రామ ప్రజలకు సుపరిచితుడైన చిక్కాల శ్రీనివాసరావు, వృత్తిపరమైన కార్యకలాపాలతో పాటు సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లోనూ చురుకైన పాత్ర పోషిస్తున్నారు. గ్రామంలో జరిగే వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో తనదైన ముద్ర వేస్తూ ప్రజలతో సత్సంబంధాలను కొనసాగిస్తున్నారు. కేవలం ఒక వర్గానికే పరిమితం కాకుండా అన్ని వర్గాల ప్రజలతో కలిసిమెలిసి ఉండటం తన ప్రత్యేకతగా నిలుస్తోంది.

పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ

గ్రామంలో చాలాకాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో మెరుగుపరచడం, అంతర్గత రహదారుల నిర్మాణం, విద్యుత్ సమస్యల పరిష్కారం వంటి అంశాలకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని పేర్కొంటున్నారు. ప్రతి వీధిలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, గ్రామంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను గుర్తించి దశలవారీగా పూర్తి చేసేందుకు కృషి చేస్తానని వెల్లడిస్తున్నారు.

అన్ని వర్గాల ప్రజలతో సత్సంబంధాలు

గ్రామాభివృద్ధి అనేది రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా జరగాలని శ్రీనివాసరావు ఆకాంక్షిస్తున్నారు. ప్రతి ఒక్కరి సమస్యను తన సమస్యగా భావిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండటమే తన అభిమతమని చెబుతున్నారు. గ్రామంలోని యువత, పెద్దలు, మహిళలు, రైతులు ఇలా అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలన్నది తన ఆలోచనగా వివరిస్తున్నారు.

ప్రజల మద్దతుతోనే ఎన్నికల బరిలోకి

గ్రామ ప్రజల ఆదరాభిమానాలు, ప్రోత్సాహం, అన్ని వర్గాల వారి మద్దతుతోనే ఎన్నికల బరిలోకి దిగుతున్నట్లు చిక్కాల శ్రీనివాసరావు పేర్కొంటున్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే గ్రామ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపించేందుకు కృషి చేస్తానని చెబుతున్నారు.

తిప్పరాజుపాలెంలో పెండింగ్ సమస్యలకు పరిష్కారం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తన ముందున్న ప్రధాన లక్ష్యాలని చిక్కాల శ్రీనివాసరావు తన అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు.

కాకినాడ లో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

- **లౌకిక ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని కాపాడు కుందాం ప్రతిజ్ఞ**



కాకినాడ (మనసులో మాట) నవంబర్ 27

రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

అంబేద్కర్ బుద్ధ విహార్ సభ్యులు కాశి రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా సిఐటియు అఖిలభారత ఉపాధ్యక్షురాలు జి. బేబిరాణి, అంబేద్కర్ ఉద్యమ నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, పిల్లి రామారావు తదితరులు అంబేద్కర్ చిత్ర పటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భారత రాజ్యాంగ పీఠిక ను సామూహికంగా పఠించి, లౌకిక ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అయితాబత్తుల రామేశ్వరరావు, పిల్లి రామారావు, జి. బేబిరాణి లతో పాటు యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి. ప్రభాకర వర్మ, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కెఎంఎంఆర్ ప్రసాద్, బామ్ సెఫ్ నాయకులు కుమార్ బాబు



డా. రాముడు తదితరులు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగా అంబేద్కర్ కృషిని కొనియాడారు. భిన్నత్వంలో ఏకత్వమే భారతీయ విశిష్టతగా రాజ్యాంగం మార్గదర్శకం చేస్తుందన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమ ఆకాంక్షలకు అనుగుణంగా రాజ్యాంగాన్ని రూపొందించడంలో అంబేద్కర్ కృషి చిరస్మరణీయం అన్నారు. అయితే నేడు మనువాదం నుండి రాజ్యాంగానికి సవాల్ ఎదురవుతోందన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం, ఫెడరలిజం నాలుగు స్తంభాలుగా రాజ్యాంగం ఉందన్నారు. ప్రస్తుతం నాలుగు వైపుల నుండి రాజ్యాంగ లక్ష్యాలకు సవాలు ఎదురవుతోందన్నారు. అయితే మన దేశంలో పాలకులు విఫలమైనప్పుడు ప్రజలు ముందుకు వచ్చి ప్రజాస్వామ్యాన్ని దేశాన్ని కాపాడుకోవడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం దేశంలో జెన్ జి ఉద్యమం కొత్త ఆశలను చిగురింప చేస్తుందన్నారు. అంబేద్కర్ ఆశయాల బాటలో ఉన్నవారు లౌకిక ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని కాపాడు కోవడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో డా. కోరుకొండ బాబ్జి, డాక్టర్ పావన కుమార్, పి. సుధీర్, కాశి బాలయ్య, భయ్యా విజయ్ కుమార్, కాళి, కెవిస్ శ్రీనివాస్, దాసరి వెంకట్, మలక వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణ, చెల్లుబోయిన వెంకటరమణ, డి. ఆదర్శ్, జి. సత్యానందం, తదితరులు పాల్గొనగా పలివెల వీరబాబు వందన సమర్పణ చేశారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

ముగిసిన పల్లెల ప్రచార పోరు.. ఇక ఓటరు తీర్పే కీలకం!

- **వారం రోజులుగా హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రచారం ముగింపు.. చివరి రోజు గ్రామాల్లో భారీ ర్యాలీలు**
- **26 పంచాయతీల్లో నాలుగు పంచాయతీలకు ఏకగ్రీవం.. మిగిలిన 22 పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు పోటీ**
- **రాజకీయ ఉద్దండుల వ్యూహాల నుంచి యువత నూతన ఆలోచనల వరకు.. గ్రామాల్లో హోరెత్తిన ప్రచారం**



కాజులూరు, నవంబర్ 27:

కాజులూరు మండలంలోని గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచార పర్వానికి తెరపడింది. గత వారం రోజులుగా గ్రామాల్లో హోరాహోరీగా సాగిన రాజకీయ పోరు శుక్రవారంతో ముగిసింది. సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు తమదైన శైలిలో ప్రచార వ్యూహాలను అమలు చేస్తూ ఓటర్లను ఆకట్టుకునేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నించారు. రాజకీయ ఉద్దండుల నుంచి నేటి యువ నాయకుల వరకు ప్రతి ఒక్కరూ నూతన ఆలోచనలు, వినూత్న ప్రచార పద్ధతులతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణాన్ని వేడెక్కించారు. మండలంలోని మొత్తం 26 గ్రామ పంచాయతీల్లో నాలుగు పంచాయతీలకు సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 22 పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. అదేవిధంగా 22 పంచాయతీలకు గాను మూడు పంచాయతీల్లో వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 19 పంచాయతీల్లో వార్డు సభ్యుల స్థానాలకు పోటీ నెలకొంది. దీంతో ఆయా గ్రామాల్లో ఎన్నికల సమరం మరింత ఆసక్తికరంగా మారింది.

వ్యూహాత్మక ప్రచారంతో హోరెత్తిన గ్రామాలు

గత వారం రోజులుగా అభ్యర్థులు అనేక రాజకీయ వ్యూహాలతో ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటి ప్రచారం, ఆత్మీయ సమావేశాలు, యువతతో చర్చలు, పెద్దల ఆశీస్సులు, మహిళా ఓటర్లను కలుసుకోవడం వంటి కార్యక్రమాలతో ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నించారు. కొందరు అభ్యర్థులు అభివృద్ధి హామీలను ప్రధాన అస్త్రంగా చేసుకోగా, మరికొందరు గ్రామాల్లో తమకున్న పరిచయాలు, ప్రజలతో ఉన్న అనుబంధాన్ని నమ్ముకుని ప్రచారాన్ని సాగించారు.

చివరి రోజు భారీ ర్యాలీలు.. హోరెత్తిన సందడి

ప్రచారానికి చివరి రోజు కావడంతో పలు గ్రామాల్లో అభ్యర్థులు భారీ ర్యాలీలు నిర్వహించారు. అనుచరులు, అభిమానులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో గ్రామ వీధులన్నీ సందడిగా మారాయి. తమ అభ్యర్థికి మద్దతుగా నినాదాలు చేస్తూ ప్రధాన వీధుల్లో ర్యాలీలు చేపట్టారు. చివరి క్షణం వరకు ఓటర్లను కలుసుకుంటూ తమకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు.

ఇక ఓటరు తీర్పు కోసం ఉత్కంఠ

ప్రచార పర్వం ముగియడంతో ఇప్పుడు అందరి దృష్టి పోలింగ్‌పై కేంద్రీకృతమైంది. గ్రామాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు వంటి స్థానిక సమస్యల పరిష్కారమే ప్రధాన అంశాలుగా ఎన్నికల బరిలో అభ్యర్థులు తమ వాదనలను వినిపించారు. రాజకీయ సమీకరణాలు, వ్యక్తిగత పరిచయాలు, సామాజిక మద్దతు, అభ్యర్థుల వ్యక్తిగత ప్రతిష్ఠ వంటి అంశాలు ఓటర్ల నిర్ణయంపై ప్రభావం చూపనున్నాయి.

వారం రోజులుగా సాగిన ప్రచార హోరు ముగియగా, ఇక గ్రామాల్లో ప్రజాస్వామ్య పండుగకు రంగం సిద్ధమైంది. అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించేది ఓటరు తీర్పే కావడంతో గ్రామాల్లో రాజకీయ ఉత్కంఠ నెలకొంది.

తుని నియోజకవర్గంలో 4 పంచాయతీలు ఏకగ్రీవం.





తుని (మనసులో మాట)
నవంబర్ 27

తుని నియోజకవర్గంలో 4 పంచాయతీలు ఏకగ్రీవమైనవి. స్వగ్రామం ఏవీ నగరం పంచాయతీ లో సర్పంచ్ గా తెలుగుదేశం పార్టీ అభ్యర్థి యనమల అలేఖ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే యనమల దివ్య చూపిన అభివృద్ధి మార్గంలో పయనించి గ్రామాభివృద్ధికి తమ వంతు తోడ్పాటు అందించేందుకు పోటీకి నామినేషన్లు వేసిన అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో ఏవీ నగరం సర్పంచ్ గా యనమల అలేఖ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అలాగే తొండంగి మండలం అద్దరిపేట పంచాయితీని టీడీపీ ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది.ఇక్కడ ముత్తి శ్రీదేవి సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అలాగే తుని మండలం ఎన్.సూరవరం సర్పంచ్ గా పోతంశెట్టి లక్ష్మీ కూడ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అలాగే ఎమ్మెల్యే యనమల దివ్య దత్తత గ్రామం కోటనందూరు మండలం అల్లిపూడిని టీడీపీ కైవసం చేసుకుంది. సర్పంచ్ గా అంకంరెడ్డి బుల్లిబాబు పోటీ లేకుండా ఎన్నికయ్యారు. తుని నియోజకవర్గంలో నాలుగు పంచాయితీలకు టీడీపీ ఏకగ్రీవంతో సొంతం చేసుకున్నారు.ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచులకు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు,ప్రభుత్వ విఫ్ యనమల దివ్య శుభాకాంక్షలు తెలిపారు.





ఉమా సాంబ శివునికి ఆరుద్ర అభిషేకాలు

కాకినాడ (మనసులో మాట) నవంబర్ 27

కార్తీక మాసంలో అతి పవిత్రమైన ఆరుద్ర నక్షత్రం కలిగిన రోజు న ఈశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించడం జరిగిందని పురోహితులు యాతగిరి మద్వేష్ అన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక గోదారి గుంట జర్నలిస్ట్ కాలనీలో వేంచేసి ఉన్న రమా సత్యదేవ మందిర ప్రాంగణంలో శ్రీ ఉమా సాంబశివె స్వర లింగానికి ఏకాదశి రుద్రాభిషేకం తో పాటు వివిధ రకాల పండ్లు సుగంధ ద్రవ్యాలతో నమక చమక సహిత శివ అష్టాక్షరి మంత్ర సామూహిక పారాయణ తో అభిషేకాలు జరిగాయి. నారికేలాభిషేకము, చెరుకు రసంతో కూడిన ప్రత్యేక అభిషేకాన్ని
హరిద్రా,కుంకుమ, గంధభిషేకాన్ని కూడా అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తొలుత విష్ణు ప్రతిరూపమైన సాలిగ్రామ శిలతో సహిత



శివలింగానికి పంచామృతాభిషేకము అత్యంత భక్తి శ్రద్ధలతో చేశారు. ఉత్తరాది మఠాధిపతులు సత్యాత్మ తీర్థ స్వామిజీ ఆశీస్సుల తో ఆరుద్ర నక్షత్ర విశేషాలు అభిషేకాలు నిర్వహించడమే కాక స్వామివారికి ఇష్టమైన భస్మాభిషేక (విభూది)పూజను కూడా నిర్వహించారు.
ఈ సందర్భంగా మద్వేష మాట్లాడుతూ కార్తీక మాసం లో భక్తుల సహకారం తో విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా ఆరుద్ర నక్షత్ర విశేష అభిషేకాలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. శుక్రవారం రావడం ఎంతో విశేషమని అందులో శ్రీ రమా సహితసత్య నారాయణస్వామికి, దాసాంజనేయ స్వామి వారికి కూడా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించా మన్నారు. భక్తుల అభీష్టాలను తప్పక నెరవేరుతాయని అన్నారు. తొలి పూజను సత్యాత్మ తీర్థ స్వామీజీ పేరా నిర్వహించగా అనంతరం భక్తుల గోత్ర నామాలతో అభిషేకాలు జరిగాయని చెప్పారు. అనంతరం వసంత హారతిని మౌనిక, పద్మావతిలు కలిసి చేశారు. ఈ కార్యక్రమంలో గోపిక ప్రసాద్, పి సంజీవ్, పాసుగంటి రామచంద్ర రావు పద్మావతి, రేగడిమిల్లి కృష్ణమూర్తి కళ్యాణి, పన్యాల నరసింహారావు(బుజ్జి), తుంగమణి, రఘోత్తమ, శ్రీ రమామణి, డా. పరశురామ్ తోపాటు పలువురు పాల్గొన్నారు.

ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా డా. చిట్ల కిరణ్

కాకినాడ (మనసులో మాట) నవంబర్ 27

భారత వైద్య సంఘం (ఐఎంఏ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా డా. చిట్ల కిరణ్ నవంబర్ 28, శనివారం బాధ్యతలు స్వీకరించనున్నారు.అమలాపురం లోని కిమ్స్ అండ్ ఆర్ఎఫ్ లెక్చర్ గ్యాలరీ 2 లో సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమయ్యే 68 వ ఐఎంఏ రాష్ట్ర వార్షిక మహాసభ ప్రారంభోత్సవంలో ఈ కార్యక్రమం జరగనుంది.2026-27 సంవత్సరానికి రాష్ట్ర అధ్యక్షుడిగా డా. పి.ఎస్. శర్మ, కార్యదర్శిగా డా. చిట్ల కిరణ్‌తో పాటు నూతన కార్యవర్గ సభ్యులు బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు డా. ఎస్. బలరాజు సభకు అధ్యక్షత వహిస్తారు. ఐఎంఏ పూర్వ జాతీయ అధ్యక్షుడు డా. ఆర్.వి. అశోకన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.ఈ సందర్భంగా డా. చిట్ల కిరణ్‌కు, నూతన రాష్ట్ర కార్యవర్గానికి ఐఎంఏ కాకినాడ శాఖ తరపున హృదయపూర్వక అభినందనలు. రాష్ట్రవ్యాప్తంగా వైద్యుల సంక్షేమానికి, ప్రజారోగ్య కార్యక్రమాలకు డా. కిరణ్ తన పదవీకాలంలో విశేష కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నాం.

డా. కె. వెంకట రమణ, అధ్యక్షుడు
డా. ఎస్. సీ. హెచ్. ఎస్. రామకృష్ణ, కార్యదర్శి
ఐఎంఏ కాకినాడ శాఖ

విద్యార్థి దశ నుండి మాదకద్రవ్యాలపై అవగాహన అవసరం

కాకినాడ (మనసులో మాట)
నవంబర్ 27

విద్యార్థి దశ నుండే డ్రగ్స్ (మాదక ద్రవ్యాలు) పట్ల అవగాహన పెంపొందించుకుని, వాటికి దూరంగా ఉండాలని 1 వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.వెంకట సాయి శ్రీవల్లి సూచించారు. స్థానిక గాంధీనగర్ లోని శ్రీ అగస్త్య జూనియర్ కళాశాలలో శుక్రవారం ఉదయం విద్యార్థులకు డగ్స్ అడిక్షన్ (మాదక ద్రవ్యాల వ్యసనం)పై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ చక్రవర్తి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి,డ్రగ్స్ వలన కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు.
మాదక ద్రవ్యాల వ్యసనం వలన మెదడు పనితీరును మార్చి చదువు లేదా పనిపై దృష్టి తగ్గడం, కుటుంబం, స్నేహితులకు దూరంగా ఉండటం, ఆర్థిక, చట్ట పరమైన సమస్యలలో చిక్కుకుంటా మన్నారు. డ్రగ్స్ కు దూరంగా ఉండటం వలన ఆరోగ్యాన్ని, భవిష్యత్తును కాపాడు కోపచ్చున్నారు. దేశంలో అధిక సంఖ్యలో యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని, చెడు వ్యసనాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదన్నారు. స్వచ్ఛంధ సంస్థల భాగస్వామ్యంతో డ్రగ్స్ కు వ్యతిరేకంగా అవగాహన సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో ప్యానల్ లాయర్స్, లీగల్ సెల్ కమిటీ ప్రతినిధులు పి.ఏసుబాబు, కె.రాజశేఖర్, బి.దుర్గాభవానీ, ఏ.శైలజ, వి.బి.ఎస్.బహదూర్ షా ఆర్.మల్లిఖార్జున రావు, శ్రీ అగస్త్య ఎడ్యుకేషనల్ సొసైటీ కో ఆర్డినేటర్ అల్లుమల్లు ఏలియా, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి ఓటు హక్కు.. 110 పోస్టల్ బ్యాలెట్లు నమోదు!



- **గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ విజయవంతంగా పూర్తి**

వి.ఆర్.పురం.(మనసులోమాట) నవంబర్ 27;

వి.ఆర్.పురం మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికలు-2026 నేపథ్యంలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ ప్రక్రియలో మండలవ్యాప్తంగా మొత్తం 110 పోస్టల్ బ్యాలెట్లు నమోదైనట్లు ఎంపీడీవో పి. ఇమ్మానుయేల్ వెల్లడించారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పించినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల విధుల కారణంగా సాధారణ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేయలేని సిబ్బందికి ఈ అవకాశం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. నమోదైన పోస్టల్ బ్యాలెట్ పత్రాలను పోలింగ్ రోజున కౌంటింగ్ ప్రారంభమయ్యే సమయానికి ముందుగానే సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో సమర్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి ఎస్. జె.వి. రామ్మోహన్ రావు, అన్ని గ్రామపంచాయతీల రిటర్నింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కొవ్వొత్తుల ర్యాలీ



ఏలూరు, నవంబర్ 27(మనసులో మాట)

బాల్య వివాహాలు చిన్నారుల భవిష్యత్తును చీకటిలోకి నెడుతున్నాయని, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా జడ్జి యన్. శ్రీలక్ష్మి పిలుపునిచ్చారు. బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏలూరు జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలల హక్కులను హరించడంతో పాటు వారి విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. బాల్య వివాహాల వల్ల చిన్నారుల జీవితాలు చీకటిమయమవుతున్నాయని, ఆ చీకటి నుంచి వెలుగులోకి తీసుకురావాలనే సందేశంతో ఈ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. బాల్య వివాహాల నివారణలో ప్రజలు కూడా భాగస్వాములై తమ సామాజిక బాధ్యతను నిర్వర్తించాలని కోరారు.

మాతృభాషలో విద్యాబోధనకు ప్రాధాన్యత ఇవ్వాలి

- **వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ**

రాజమహేంద్రవరం (మనసులో మాట) నవంబర్ 27



నన్నయ యూనివర్సిటీ లో రెండు రోజుల జాతీయ వర్‌క్‌షాప్ ప్రారంభం అవుతున్నాయని తెలిపారు. మాతృభాష లోనే విద్యా బోధన జరగాలన్నది తన ఆకాంక్ష అని, జాతీయ విద్యా విధానం 2020 సైతం మాతృ భాషలో బోధనకు ప్రాధాన్యత నిస్తోందని ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం ఆధ్వర్యం లో విద్యాశాఖ మంత్రిత్వ శాఖ, భారతీయ భాషా సమితి న్యూఢిల్లీ సహకారంతో విశ్వవిద్యాలయ సెమినార్ హాల్లో రెండు రోజుల జాతీయ వర్‌క్‌షాప్‌ను శుక్రవారం ప్రారంభించారు. భారతీయ భాషల దిశగా ఉపాధ్యాయుల సామర్థ్య నిర్మాణాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్ర స్థాయి అమలు ప్రణాళిక రూపకల్పన అనే అంశంపై ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ నన్నయ విగ్రహానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మాతృభాషలో విద్యాబోధన జరగడం ద్వారా విద్యార్థులు విషయ పరిజ్ఞానాన్ని సులభంగా అర్థం చేసుకోవడంతో పాటు తమ భావాలను సమర్థవంతంగా వ్యక్తపరచగలరని అన్నారు. జాతీయ విద్యా విధానం 2020 భారతీయ భాషల్లో బోధనకు ప్రాధాన్యతనిస్తోందని, విద్యార్థులు తెలుగు, ఆంగ్లంతో పాటు ఇతర భాషల్లోనూ నైపుణ్యాన్ని పెంపొందించు కోవాలని ఆకాంక్షించారు. గిరిజన భాషలైన కోయ, సవర తదితర భాషలను పరిరక్షించడంతో పాటు వాటిలో బోధనా సామగ్రిని రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయులకు ద్విభాషా బోధనలో శిక్షణ అందించి, విజ్ఞానశాస్త్రం, సాంకేతిక విద్యతో పాటు అన్ని రంగాల్లోనూ భారతీయ భాషల్లో విద్యాబోధనను ప్రోత్సహించాలని సూచించారు. కృత్రిమ మేధస్సును ఉపయోగించి అనువాదాలు, ఆడియో పాఠాలు రూపొందించవచ్చని, వాటిని భాషా నిపుణులు పరిశీలించాలని తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయంలో భాషలలో పరిశోధనలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

నేషనల్ సెంటర్ ఫర్ ఎర్త్ సైన్స్ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.వి. చలపతిరావు మాట్లాడుతూ భారతీయ విద్యా చరిత్రలో గురుకుల విద్యా విధానానికి విశిష్ట స్థానం ఉందన్నారు. నలంద, తక్షశిల వంటి ప్రపంచ ప్రఖ్యాత విద్యా కేంద్రాలు అపారమైన విజ్ఞాన సంపదకు నిలయాలుగా నిలిచాయని, అనేక దేశాల నుంచి విద్యార్థులు, విజ్ఞానాభిలాషులు భారతదేశానికి వచ్చి జ్ఞానాన్ని ఆర్జించేవారని వివరించారు.

ఢిల్లీ విశ్వ విద్యాలయ ఆచార్య జి. వెంకట రామయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి, సరైన దిశానిర్దేశం చేసే గురువులు, విద్యా విధానం అవసరమన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంలో భారతీయ భాషా పుస్తక యోజన ద్వారా భారతీయ భాషా సమితి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

బాబాసాహెబ్ భీంరావు అంబేద్కర్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్, డీన్ డా. రాజ్ శరణ్ షాహి మాట్లాడుతూ గురువులు, విద్యార్థుల మధ్య మేధోపరమైన అనుబంధంతో పాటు హృదయ పూర్వకమైన సంబంధం కూడా ఉండాలన్నారు. దేశంలోని భిన్న భాషలకు సముచిత ప్రాధాన్యతనిస్తూ మాతృభాషలో విద్యాబోధనను ప్రోత్సహించాలని పేర్కొన్నారు.

వర్‌క్‌షాప్ కన్వీనర్ ఆచార్య కె. శ్రీరమేష్ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం 2020 లక్ష్యాలకు అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక పాఠ్యాంశాలను భారతీయ భాషల్లో రూపొందించేందుకు ఉపాధ్యాయుల సామర్థ్యాలను పెంపొందించడం లో ఈ వర్‌క్‌షాప్ దోహదపడుతుందన్నారు. భారతాన్ని ఆంధ్రీకరించిన ఆదికవి నన్నయ, 19 గిరిజన భాషలకు లిపి రూపొందించిన ఆచార్య ప్రసన్నశ్రీ ఉన్న ఈ ప్రాంతం లో భాషలపై జాతీయ సదస్సు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

అనంతరం అతిథులను ఘనంగా సత్కరించి నన్నయ జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమం లో కోకన్వీనర్, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ ప్రొఫెసర్ డి. మురళీధరరావు, నన్నయ విశ్వ విద్యాలయ ఆంగ్ల విభాగ అధ్యాపకులు డా. ఎన్. సజనారాజ్, డా. ఎన్. సూర్య రాఘవేంద్ర, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

మీడియా పాసులున్నా...!

- **నో ఎంట్రీ!**
- **కొందరికి రెడ్ కార్పెట్..**
- **మరికొందరికి అడ్డంకులు**

కాకినాడ (మనసులో మాట) నవంబరు 27

కాకినాడ రూరల్ మండలం లో జరిగిన సర్పంచ్ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మీడియా పట్ల పోలీసుల తీరు తీవ్ర విమర్శలకు దారితీసింది. జిల్లా పంచాయతీ అధికారులు అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులకు అధికారికంగా మీడియా పాసులు జారీ చేసినప్పటికీ, కౌంటింగ్ కేంద్రాల వద్ద వాటికి విలువ లేకుండా పోయింది.

సర్పవరం జడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం వద్ద ఈ పరిస్థితి స్పష్టంగా కనిపించింది. వార్డు సభ్యుల ఓట్ల లెక్కింపు జరుగుతున్న సమయంలో కొందరు విలేకరులు కౌంటింగ్ హాల్ లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించ గా పోలీసులు అడ్డుకున్నారు. పాసులు చూపించినా అనుమతించలేదు. దీంతో పేరున్న మీడియా ప్రతినిధులు సైతం నిరాశతో వెనుదిరిగి వెళ్లిపోయారు.

అయితే ఇదే సమయంలో ఒకరిద్దరు మాత్రం కౌంటింగ్ హాల్ లోపలే ఉండటం అందరి దృష్టిని ఆకర్షించింది. అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న ఓ విలేకరి లోపలే ఉన్నారనే ఆరోపణలు వినిపించాయి. ఇదే విషయాన్ని ఇతర విలేకరులు ప్రశ్నించగా, చివరకు అతన్ని గుర్తించి పోలీసులు బయటకు పంపించారు. దీంతో మీడియాకు ఒక న్యాయం, మరికొందరికి మరో న్యాయమా అనే ప్రశ్న తలెత్తింది. అక్కడ వేచి ఉన్న విలేకరులను ఎర్ర బాట ఎడిటర్ పితాని రాము కలిశారు. కౌంటింగ్ హాల్లోనే టెంటు కింద నిలబడి సమాచారం సేకరిస్తామని చెప్పినా పోలీసులు అంగీకరించలేదు. దీంతో ఆయన వెంటనే జిల్లా ఎస్పీ సీసీని ఫోన్లో సంప్రదించారు. మీడియా పాసులు ఉన్నప్పటికీ లోపలకు పంపకపోవడానికి కారణమేమిటని ప్రశ్నించారు. దీనికి స్థానిక పోలీసులను సంప్రదించాలని, ఆర్వో అనుమతి తోనే వెళ్లాలని సమాధానం వచ్చింది.

అనంతరం పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేయగా, ఆయన గుమస్తాను పంపి పోలీసులకు చెప్పి మీడియాను లోపలకు అనుమతించారు. కానీ లోపలకు వెళ్లిన తర్వాత కూడా ఇబ్బందులు తప్పలేదు. కౌంటింగ్ హాల్లో ఫోటోలు తీసుకోవడానికి అనుమతి అడగగా, వీల్లేదని, లేకపోతే బయటకు వెళ్లాలని పోలీసులు హెచ్చరించారు.



ఈ మొత్తం వ్యవహారం పలు ప్రశ్నలను లేవనెత్తింది. మీడియా పాసులు జారీ చేసినప్పుడు వాటిని గౌరవించాల్సిన బాధ్యత పోలీసులపై లేదా..? కౌంటింగ్ కేంద్రంలోకి ఎవరిని అనుమతించాలి, ఎవరిని అనుమతించకూడదనే విషయంలో స్పష్టమైన, లిఖితపూర్వక ఆదేశాలు ఎందుకు లేవు..? అధికారుల మధ్య సమన్వయ లోపం వల్లనే విలేకరులు ఇబ్బంది పడాలా..? ఎన్నికల కౌంటింగ్ అనేది పారదర్శకంగా జరగాల్సిన ప్రక్రియ. మీడియా ద్వారానే ప్రజలకు నిజమైన ఫలితాలు, పరిస్థితులు తెలుస్తాయి. అలాంటి మీడియానే బయట నిలబెట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని జర్నలిస్టులు అంటున్నారు. ఇప్పుడు ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ సమయం లోనూ ఇదే సమస్య పునరావృతం అవుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కాబట్టి పోలీసు శాఖకు ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేయాలని, మీడియా పాసులకు పూర్తి గౌరవం కల్పించాలని, అందరికీ ఒకే నిబంధన వర్తించేలా చూడాలని విలేకరులు కోరుతున్నారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

బాలికల భవిష్యత్తును కాపాడటం సమాజ బాధ్యత.. బాల్యవివాహాలకు చరమగీతం పాడాలి!

- **బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు వి. గాంధీ బాబు**

వి.ఆర్.పురం.(మనసులోమాట) నవంబర్ 27;



బాల్యవివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా గుర్తించి, వాటి నివారణకు ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు వి. గాంధీ బాబు పిలుపునిచ్చారు. బాలికలకు విద్య, ఆరోగ్యం, సమాన హక్కులు కల్పించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆయన స్పష్టం చేశారు. అంతర్జాతీయ బాల్య, బలవంతపు వివాహాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాల్యవివాహం అనేది కేవలం కుటుంబానికి సంబంధించిన అంశం కాదని, బాలికల బాల్యం, విద్య, ఆరోగ్యం, స్వేచ్ఛ, భవిష్యత్తును దెబ్బతీసే తీవ్రమైన సామాజిక సమస్య అని పేర్కొన్నారు. చిన్న వయస్సులో వివాహాలు జరగడం వల్ల బాలికలు చదువుకు దూరమవడమే కాకుండా అనేక ఆరోగ్య, మానసిక, ఆర్థిక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ప్రతి బాలిక ఉన్నత విద్యను అభ్యసించి, తన జీవితానికి సంబంధించిన నిర్ణయాలను స్వయంగా తీసుకునే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. బాల్యవివాహ నిరోధక చట్టం-2006ను పటిష్టంగా అమలు చేయాలని, బాల్యవివాహాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మధ్యలోనే బడి మానేసిన బాలికలను తిరిగి పాఠశాలల్లో చేర్పించడంతో పాటు, బాల్యవివాహాల నుంచి రక్షించిన బాలికలకు కౌన్సెలింగ్, వైద్య సేవలు, విద్యా సహాయం, పునరావాసం అందించాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ నాయకత్వంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ, పోలీసు, విద్యా, వైద్య ఆరోగ్య శాఖలు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, గ్రామ, వార్డు సచివాలయాలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రతి గ్రామాన్ని బాల్యవివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. బాల్యవివాహాలపై విద్యార్థులు, యువతలో అవగాహన పెంపొందించాలని, ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులకు లేదా బాలల సహాయవాణికి సమాచారం అందించాలని సూచించారు. బాలికల విద్యకు అబ్బాయిలు సైతం అండగా నిలవాలని, బాలల హక్కుల పరిరక్షణలో యువత క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. బాల్యవివాహాలను ప్రోత్సహించకుండా అడ్డుకోవడం, ప్రతి బాలిక విద్యకు తోడ్పడటం, ప్రతి చిన్నారి హక్కులను గౌరవించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని గాంధీ బాబు స్పష్టం చేశారు. బాల్యం వికసించాలి.. బాలికల భవిష్యత్తు వెలుగులు నింపాలి.. బాల్యవివాహాలు పూర్తిగా అంతం కావాలనే లక్ష్యంతో ప్రభుత్వ శాఖలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు కలిసికట్టుగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.



ట్రాఫిక్ రూల్స్ పై అవగాహనా కల్పించిన

- **కాకినాడ ట్రాఫిక్ -1 పోలీసుల**

కాకినాడ (మనసులో మాట) నవంబర్ 27

కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు, ఎన్ ఎస్ వి కే దుర్గారావు, ఎస్ డి పి ఓ కాకినాడ పర్యవేక్షణలో కాకినాడ మెయిన్ రోడ్ నందు ట్రాఫిక్ రూల్స్ పైన అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది ట్రాఫిక్ రూరల్స్ పై అవగాహన లో భాగంగా
హెల్మెట్ యొక్క ఆవశ్యకతను వివరిస్తూ మోటార్ సైకిల్స్ నడిపే ప్రతి ఒక్కరు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. యువత వాహనాలను అతివేగంగా నడపడం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు.వాహనం నడుపు ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని,
మైనర్ డ్రైవింగ్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాల బారిన పడి తల్లిదండ్రులకు తీరని సోకాన్ని మిగులు స్తున్నారని,ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్ వలన వాహన సామర్థ్యం కోల్పోయి రోడ్ ప్రమాదములు ఎక్కువగా జరుగుతు న్నాయని,డ్రంక్ అండ్ డ్రైవ్ చేసి వాహనం నడపడం వలన ఎక్కువ మంది రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలను కోల్పోతున్నారని,
మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపడం వలన రోడ్డు ప్రమాదాలు బారిన పడుతున్నారని,
కాకినాడ పట్టణం నందు ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద రెడ్ లైట్ పడిన అనంతరం, జీబ్రా లైన్స్ వద్ద మాత్రమే రోడ్ దాటవలెనని
రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో సహాయం చేసిన వారికి గుడ్ సమారిటెన్ క్రింద 25 వేల రూపాయలు నగదు బహుమతి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఇవ్వబడునని ఒక లక్ష యాభై వేల రూపాయలు వరకు రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత ఉచిత చికిత్స చేయబడునని అవగాహన కల్పించారు. ఈ యొక్క కార్యక్రమం నందు ట్రాఫిక్ 1 ఇన్స్పెక్టర్ ఎన్. రమేష్ మరియు ట్రాఫిక్ సిబ్బంది, పాల్గొన్నారు

గ్రామాభివృద్ధికి సమిష్టి నిర్ణయాలే కీలకం

- **తాగునీరు, డ్రైనేజీ సమస్యల తక్షణ పరిష్కారమే ప్రధాన లక్ష్యం**
- **అన్ని వర్గాల ప్రజల మద్దతుతో సర్పంచ్‌గా బరిలోకి.. అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి**
- **కోలంక సర్పంచ్ అభ్యర్థి బూరెల పెదకాపు**

కాజులూరు (మనసులో మాట)నవంబర్ 27

కోలంక గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తన ప్రధాన లక్ష్యమని కోలంక గ్రామ సర్పంచ్ అభ్యర్థి బూరెల పెదకాపు స్పష్టం చేశారు. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని వెల్లడించారు. అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలు, సూచనలను పరిగణనలోకి తీసుకుంటూ సమిష్టి నిర్ణయాలతో గ్రామాభివృద్ధికి బాటలు వేస్తానని పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యం

గ్రామంలో ప్రధానంగా తాగునీటి సమస్య, డ్రైనేజీ సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, వీటిని పరిష్కరించడమే తన ముందున్న తక్షణ కర్తవ్యమని పెదకాపు తెలిపారు. ప్రతి కుటుంబానికి సురక్షితమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, మురుగునీటి పారుదలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానన్నారు. గ్రామంలోని ప్రతి వీధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకొని, వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తానని వివరించారు.

అందరి అభిప్రాయాలతో అభివృద్ధి ప్రణాళికలు

గ్రామాభివృద్ధి అనేది ఒకరిద్దరి నిర్ణయాలతో సాధ్యమయ్యేది కాదని, ప్రజలందరి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. గ్రామంలోని అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడతానని చెప్పారు. రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా గ్రామ ప్రజలందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని స్పష్టం చేశారు.

ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటా

సర్పంచ్‌గా ఎన్నికైన అనంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటానని పెదకాపు తెలిపారు. ఏ సమస్య వచ్చినా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం లభించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులు సాధించేందుకు ప్రయత్నిస్తానన్నారు.

అన్ని వర్గాల మద్దతుతోనే ఎన్నికల బరిలోకి

గ్రామంలోని అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలు, మద్దతుతోనే సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచానని బూరెల పెదకాపు పేర్కొన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే గ్రామ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తానని, ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు.
కోలంక గ్రామ సమగ్ర అభివృద్ధికి తనకు ఒక అవకాశం కల్పించాలని, గ్రామ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని అత్యధిక మెజార్టీతో గెలిపించి ఆశీర్వదించాలని ఓటర్లను ఆయన అభ్యర్థించారు.
సమిష్టి నిర్ణయాలు.. సమగ్ర అభివృద్ధి.. ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం.. ఇదే తన ఎన్నికల లక్ష్యమని బూరెల పెదకాపు వెల్లడించారు.

తంటికొండలో జనసేన అభ్యర్థుల తరపున తుమ్మలపల్లి రమేష్ ఎన్నికల ప్రచారం

గోకవరం (మనసులో మాట) నవంబర్ 27

గోకవరం మండలం తంటికొండ గ్రామంలో జనసేన పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి మిరియాల శ్రీనివాస్ (గాంధీ)తో పాటు వార్డు సభ్యుల విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అభ్యర్థులతో కలిసి గ్రామంలో విస్తృతంగా పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. సర్పంచ్ అభ్యర్థి మిరియాల శ్రీనివాస్ (గాంధీ)తో పాటు వార్డు సభ్యులకు మద్దతు తెలపాలని ఓటర్లను అభ్యర్థించారు. జనసేన పార్టీ బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు

వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ.

రంపచోడవరం(మనసులో మాట) నవంబర్ 27.

పోలవరం జిల్లా అడ్డతీగల మండలం లో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయ అధికారి శ్రీ సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ యాంత్రీకరణ లో భాగంగా డ్రోన్స్ మరియు యంత్రపరిక్రాలు కస్టమ్ హైరింగ్ సెంటర్ ద్వారా రాయితీ ఉంది అని తెలియజేశారు. భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా విశిష్ట సంఖ్యను (ఏపీ ఎఫ్ఆర్) చేయించుకోవాలని రాబోయే రోజుల్లో వ్యవసాయ అనుబంధ శాఖల పథకాలన్నింటికీ ఈ విశిష్ట సంఖ్య అనుసంధానించబడుతుందని కావున ప్రతి రైతు ఏపీ ఎఫ్ ఆర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ సీఎం అఫ్ డి పి ఎం శ్రీ రాబిన్ మాట్లాడుతూ జీడిమామిడి తోటల్లో అంతర పంటగా మెడిసినల్ అండ్ ఏరోమాంటిక్



మొక్క లైన ముసగ కరివేపాకు సాగును లాంగ్ పెప్పర్ చేపట్టాలని సూచించారు . ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది మరియు రైతుల పాల్గొన్నారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

నేడు ముఖ్యమంత్రి రాజమండ్రి లో పర్యటన

- జిల్లా కోర్టు 222 ఏళ్లు, బార్ అసోసియేషన్ 131 ఏళ్ల వేడుకల్లో పాల్గొననున్న
- సీఎం నారా చంద్రబాబు నాయుడు



రాజమహేంద్రవరం (మనసులో మాట) నవంబర్ 27

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబు శనివారం తూర్పు గోదావరి జిల్లాలో పర్యటిం చనున్నారు.రాజమహేంద్ర వరంలో జరిగే జిల్లా కోర్టు 222 ఏళ్లు, బార్ అసోసియేష న్ 131 ఏళ్ల వేడుకల్లో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. ఉదయం 9.30 గంటలకు అమరావతి లోని సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరి ఉదయం 10 గంటలకు రాజమహేంద్రవ రం ఆర్ట్స్ కాలేజ్‌కు చేరుకుం టారు.

10.15 గంటలకు మంజీరా సరోవర్ ప్రీమియర్ హోటల్‌కు వెళ్తారు. మంజీరా సరోవర్ ప్రీ మియర్ హోటల్ లో 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.05 గంటల వరకు నిర్వ హించే జిల్లా కోర్టు 222 సంవ త్సరాలు, బార్ అసోసియేషన్ 131 సంవత్సరాల వేడుక ల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. రాజమహేంద్రవరంలో కార్య క్రమం ముగిసిన అనంతరం మధ్యాహ్నం 1.45 గంటలకు అమరావతి క్యాంప్ కార్యాల యానికి చేరుకుంటారు

గణపతి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ వేగుళ్ల అజయ్ కుమార్...

మండపేట (మనసులో మాట) నవంబర్, 27

మండపేట పట్టణంలోని వి వి ఎస్ ఎస్ చౌదరి సెంటర్‌లో కొలువుదీరిన వినాయకుడి ఆలయ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వ హించారు. ఈ వేడుకలకు మండపేట మున్సిపల్ చైర్మన్ వేగుళ్ల అజయ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించిన సేవా కార్యక్రమంలో భాగంగా వృద్ధులు, నిరుపేదలకు దు ప్పట్లు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ వేగుళ్ల అజయ్ కుమార్ చేతుల మీదుగా లబ్ధి దారులకు దుప్పట్లు అందజే శారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయ వార్షికోత్సవాలను ఆధ్యా త్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహించడం అభినంద నీయమని పేర్కొన్నారు. వృ ద్ధులకు, పేదలకు సహాయం అందించడం సమాజంలో మానవత్వం, సేవాభావాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు చైర్మన్ వేగుళ్ల అజయ్ కుమార్‌ను సత్కరిం చి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్ర ముఖులు, భక్తులు తదితరు లు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- పెండింగ్ ఫైళ్లను వెంటనే పరిష్కరించాలి.. కలెక్టర్ వెట్రిసెల్వి



ఏలూరు, నవంబర్ 27(మనసులో మాట)

కేటాయించిన విధులను నిర్ణీత సమయంలో గా పూర్తి చేయాలని, ఏ విభాగంలోనూ ఫైళ్లను పెండింగ్‌లో ఉంచరాదని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి కలెక్టరేట్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ ఫైళ్లను ఎక్కువకాలం పెండింగ్‌లో ఉంచే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో శుక్రవారం రెవెన్యూ అంశాల అమలు, వివిధ విభాగాల పని తీరుపై జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ శాఖ కీలకమైనదని, ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల లక్ష్యాలను సాధించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రాష్ట్రస్థాయి లో ఏలూరు జిల్లాను ముందంజలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

కలెక్టరేట్‌లోని కార్యాలయ పరిపాలన, భూసే కరణ, ఎన్నికల విభాగం, రెవెన్యూ అంశాలు, ప్రోటోకాల్, కోర్టు కేసులు తదితర విభాగాలకు సంబంధించిన పనులను నిర్దేశించిన గడువులో గా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఏ విభాగం లోనూ పనులు పెండింగ్‌లో ఉండకుండా ఫైళ్లను ఈఫైల్ విధానం ద్వారా ఉన్నతాధికారులకు పం పించాలని సూచించారు. ఇప్పటికే కలెక్టరేట్‌లోని అన్ని విభాగాల అధిపతులు, సిబ్బందికి ఈఆఫీస్ విధానంపై శిక్షణ అందించామని తెలిపారు. సిబ్బంది ప్రతిరోజూ నిర్ణీత సమయానికి కార్యాల యాలకు హాజరై, తమకు సంబంధించిన ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించాలని, ప్రభుత్వ నిబంధనల మేరకు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల ని ఆదేశించారు. విధుల పట్ల నిబద్ధతతో పనిచేసే ఉద్యోగులను ప్రోత్సహిస్తామని, నిర్లక్ష్యంగా వ్యవ హరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో వె నుకాడబోమని కలెక్టర్ స్పష్టం చేశారు.అనంతరం కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల అధిపతులతో విడివిడిగా మాట్లాడి, వారి పనితీరు, ఆయా విభా గాల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు, పరిష్కరించాల్సిన అంశాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోగా అన్ని పనులు పూర్తి చేసి ప్రజ లకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

ఎన్టీఆర్ అవతారంలో రాజేంద్రప్రసాద్ ఎన్నికల ప్రచారం..

రేఖపల్లి, వడ్డిగూడెంలో కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచార జోరు!

- ప్రత్యేక వేషధారణతో గ్రామాల్లో పర్యటన.. కత్తెర, మంచం గుర్తులపై ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి



వి.ఆర్.పురం.(మనసులోమాట) నవంబర్ 27;

వి.ఆర్.పురం మండలంలో గ్రామపంచాయతీ ఎన్ని కల ప్రచారం రోజురోజుకూ ఊపందుకుంటోంది. రేఖపల్లి, వడ్డిగూడెం గ్రామపంచాయతీల్లో కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా టీడీపీ, జనసేన, సీపీఎం నాయకులు, కార్యకర్తలు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. శుక్రవా రం రేఖపల్లి గ్రామంలో సీపీఎం బలపరిచిన కూటమి సర్పంచ్ అభ్యర్థి పూనెం ప్రదీప్ కుమార్‌ను కత్తెర గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను అభ్య ర్థించారు. అదేవిధంగా వడ్డిగూడెం గ్రామపంచాయ తీలో టీడీపీ, సీపీఎం బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి కుడియం వెంకటేష్‌ను మంచం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమాల్లో టీడీపీ నాయకుడు సవలం రాజేంద్ర ప్రసాద్ స్వర్గీయ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) వేషధారణలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్ష ణగా నిలిచింది. ఎన్టీఆర్ రూపంలో రేఖపల్లి, వి.ఆర్. పురం, వడ్డిగూడెం గ్రామాల్లో పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. కూటమి బలపరిచిన అభ్యర్థులు పూనెం ప్రదీప్ కుమార్, కుడియం వెంక టేష్‌లకు మద్దతుగా ఓట్లు అభ్యర్థించారు. ఎన్టీఆర్ వే షధారణలో రాజేంద్రప్రసాద్ ప్రచారం చేయడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి మరింత పెరిగింది. గ్రామస్తులు ఆయన వేషధారణను ఆసక్తిగా తిల కించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పనకు కట్టు బడి పనిచేసే అభ్యర్థులను ప్రజలు ఆదరించాలని కోరారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేసే నాయ కత్వాన్ని ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఓటు గ్రామ భవిష్యత్తును నిర్ణయించేదని, రేఖపల్లిలో పూనెం ప్రదీప్ కుమార్‌కు కత్తెర గుర్తుపై, వడ్డిగూ డెంలో కుడియం వెంకటేష్‌కు మంచం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమా ల్లో టీడీపీ, జనసేన, సీపీఎం కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాకినాడ నగర పాలక సంస్థ ఎన్నికల

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన రంగరాయ వైద్య కళాశాలలో మూడు కౌంటింగ్ హాళ్లను ఏర్పాటు చేసి, మొత్తం 132 టేబుళ్ల ద్వారా ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు..ప్రతి టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్,ముగ్గురు సహాయ కులను నియమించడంతో పాటు, ఫలితాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేసేందుకు డేటా ఆపరేటర్లను ఏర్పాటు చేస్తు న్నా మన్నారు.మేయర్ అభ్యర్థికి ఒక జనరల్ ఏజెంట్, ప్రతి వార్డు అభ్యర్థికి ఇద్దరు ఏజెం ట్లను నియమించుకునే అవకాశం ఉన్న ప్పటికీ, కౌంటింగ్ హాల్‌లోకి ఒక్కొక్కరిని మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. అధికారికంగా జారీ చేసిన గుర్తింపు పాస్‌లు ఉన్నవారినే పోలీసుల సహకారం తో అనుమ తిస్తామని, ఏజెంట్లు, అధికారులు ప్రవేశిం చేందుకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేసిన ట్లు వివరించారు.కౌంటింగ్ రోజు ఉదయం 6 గంటలకే ఏజెంట్లు స్ట్రాంగ్ రూమ్ వద్దకు చేరు కోవాలని, సూచించారు. ఓట్ల లెక్కిం పును ప్రాథమిక, సమగ్ర లెక్కింపు అనే రెండు దశల్లో నిర్వహిస్తామన్నారు.కౌంటింగ్ ప్రక్రి యపై సిబ్బందికి పూర్తి అవగాహన కల్పిం చేందుకు ఆదివారం ఉదయం 9 గంటలకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో మాక్ కౌంటింగ్ నిర్వహించ నున్నట్లు వెల్లడించారు. పోలీసు, ఎన్నికల శాఖల సమన్వయం తో అన్ని ఏర్పా ట్లు పూర్తి చేస్తున్నామని తెలిపారు.ఈ సమా వేశంలో ఆర్డీవో ఎస్. మల్లిబాబు, అదనపు



కమిషనర్ కేటీ. సుధాకర్, డీసీపీ కె.వి. కృష్ణా రావు, టూ టౌన్ సీఐ అప్పలనాయుడు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

తాగునీరు,పారిశుద్ధ్య పనులను సమన్వయం

- తో వేగవంతం చేయాలి
- జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్
- లక్ష్యాలను నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలి
- పెండింగ్‌లో ఉన్న వ్యక్తిగత మరుగుదొడ్లు సామాజిక
- పారిశుద్ధ్య సముదాయాల నిర్మాణాలు పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

కాకినాడ (మనసులో మాట) నవంబర్ 27



జిల్లాలో గ్రామీణ ప్రజలకు సురక్షిత మైన తాగునీరు అందించడంతో పాటు పారిశుద్ధ్య ప్రమాణాలను మెరుగు పరిచేందు కు జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) కార్యక్రమాలను సమన్వయంతో పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో జిల్లా గ్రామీణ పారిశుద్ధ్య మిషన్ పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సంబంధిత లైన్ డిపార్ట్ మెంట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) కింద చేపడుతున్న పనులు పెండింగ్ లో ఉన్న వ్యక్తిగత గృహ మరుగు దొడ్లు సామాజిక పారిశుద్ధ్య సముదాయాలు కమ్యూనిటీ సోక్ పిట్ల నిర్మాణాలు నిధుల వినియోగం తాగునీటి నాణ్యత, గ్రామీణ పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడు తూ గత ఆర్థిక సంవత్సరాల్లో వివిధ దశల్లో మంజూరై ఇంకా అసంపూర్తిగా ఉన్న పనులను గుర్తించి, వాటిని పూర్తి చేసేందుకు నిర్దిష్ట గడువులు విధించుకుని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. డిసెంబర్ 2 తర్వాత నూతన పనులకు అవసరమైన టెండర్ల ప్రక్రియ ను పూర్తి చేసి పనులు ప్రారంభించాలని సూచించారు.

ఏజెన్సీల పనితీరుపై ప్రత్యేక సమీక్ష

పనులు ప్రారంభించడంలో జాప్యం చేస్తున్న ఏజెన్సీల పనితీరును సమీక్షించాలని, స్పందించని ఏజెన్సీలకు సంబంధించిన పనులను రద్దు చేసి ప్రత్యామ్నాయ ఏజెన్సీలకు అప్పగించే అంశాన్ని పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. కొత్త ఏజెన్సీకి పనులు అప్పగిస్తే సిబ్బంది సమీకరణ, క్షేత్రస్థాయి ఏర్పాట్లకు సమయం పట్టే అవకాశం ఉన్నందున, ఇప్పటికే క్షేత్రస్థాయి అవగాహన, సిబ్బంది ఉన్న పాత ఏజెన్సీ తక్షణమే పనులు ప్రారంభించే అవకాశాన్ని కూడా పరిశీలించాల న్నారు.ఇందుకోసం పాత ఏజెన్సీ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయాలని, అవసరమైతే తన స్థాయిలో కూడా సమావేశం నిర్వహిస్తానని తెలిపారు.గతంలో విడుదల చేసిన నిధులకు అనుగుణంగా పెండింగ్‌లో ఉన్న కుళా యి కనెక్షన్లు, పైపులైన్ల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పనుల అమలు లో లైన్ డిపార్ట్‌మెంట్ల పరంగా ఎదురవుతున్న సమస్య లను గుర్తించి పరిష్కరించాలన్నారు.

వ్యక్తిగత సామాజిక పారిశుద్ధ్య నిర్మాణాలు పూర్తి చేయాలి

గతంలో మంజూరై అసంపూర్తి గా ఉన్న వ్యక్తిగత గృహ మరుగు దొడ్ల నిర్మాణాలను గుర్తించి త్వరి తగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే కొత్త సామాజిక పారిశుద్ధ్య సముదాయాల నిర్మా ణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సంతలు, బస్టాండ్లు, ఆలయాలు, పంచాయతీ కార్యా ల యాలు వంటి ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతా ల్లో వీటి నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

గ్రామాల్లో ఇళ్ల నుంచి వెలువడే వాడుక నీరు నిల్వ ఉండకుండా సోక్ పిట్లు, తగిన పారుదల, శుద్ధి ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. దీనివల్ల దోమల వ్యాప్తి, అపరిశుభ్రతను నివారించడంతో పాటు భూగర్భ జలాల కాలుష్యాన్ని అరికట్టవచ్చ న్నారు. అవసరమైన ప్రాంతాల్లో సామాజిక ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి, శుద్ధి చేసిన వాడుక నీటిని వ్యవసాయ అవసరాలకు లేదా భూగర్భ జలాల పునరుద్ధరణకు వినియోగించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించాలి

జల్ జీవన్ మిషన్ అమలు పై సమీక్షిస్తూ ప్రతి గ్రామీణ కుటుంబానికి ఫంక్షనల్ హౌస్‌హోల్డ్ ట్యాప్ కనెక్షన్ ద్వారా సురక్షితమైన, తగినంత తాగునీరు అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి వ్యక్తికి రోజుకు కనీసం 55 లీటర్ల తాగునీటిని నిర్దేశిత నాణ్యతా ప్రమాణాల మేరకు సరఫరా చేసే లక్ష్యంతో పనులను పర్యవేక్షించాలన్నారు. పైపులైన్లు ,నీటి నిల్వ ట్యాంకులు పంపింగ్ వ్యవస్థలు, ఇతర మౌలిక సదుపాయాల పనుల్లో జాప్యం లేకుండా చూడా లని ఆదేశించారు. త్రాగునీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరిశీలన చేయాలన్నారు

అమరజీవి జలధార, వాటర్ గ్రిడ్ పనులపై దృష్టి

అమరజీవి జలధార ప్రాజెక్టు ద్వారా ప్రాంతీయ స్థాయిలో, సమూహ గ్రామాల కు తాగునీరు అందించే వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు.ఆయా ప్రాజెక్టులకు గ్రామాల అనుసంధానం, నీటి సరఫరా వ్యవస్థల సామర్థ్యం, నిర్వహణ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారు లకు సూచించారు.

పెదపూడి నందు త్రాగునీటి యూనిట్ కి సంబంధించిన ట్రాన్స్ఫా ర్మర్ సమస్యను పరిష్కరిస్తామన్నారు వేసవిలో తాగునీటి ఎద్దడి నివార ణకు ముందస్తు చర్యలు తీసుకునివచ్చే వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ రూపొందిం చాలని కలెక్టర్ ఆదేశిం చారు. తక్కువ నిల్వ సామర్థ్యం ఉన్న చెరువుల ను గుర్తించి,వాటి సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. చెరువులకు సంబంధిం చిన పనులను త్వరిత గతిన పూర్తి చేయడం ద్వారా వచ్చే వేసవి నాటికి నీటి సమస్యను చాలావరకు అధిగమించ వచ్చన్నారు. ప్రతి అంశం లో లైన్ డిపార్ట్మెంట్ అధికారులు క్రియా శీలకంగా వ్యవహరించి సురక్షిత త్రాగునీరు పారిశుద్ధ్య వ్యవస్థల పనితీరును మెరుగు పరచాలన్నారు తాగునీటి సరఫరా పారిశుద్ధ్య సౌకర్యాలు పరస్పరం అనుసం ధానమైన అంశాలని, ఈ రెండు కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా గ్రామీణ ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు.

zఈ సమావేశంలో ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్.ఈ మతిన్ డిపిఓ వీ. రవికుమార్ జల శాఖ డిడి మురళీకృష్ణ డిఎం అండ్ హెచ్ ఓ కే అనిత జెడ్పి సీఈవో లక్ష్మణరా వు తదితరులు పాల్గొన్నారు

కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఆరిమిల్లి విస్తృత ప్రచారం

- తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో బైక్ ర్యాలీలు..
- సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా ఎమ్మెల్యే పర్యటన

తణుకు (మనసులో మాట) నవంబర్ 27:



పంచాయతీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా స్థానిక ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ విస్తృత ప్రచారం నిర్వహించారు. శుక్రవారం తణుకు నియోజకవర్గ పరిధిలోని తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో పలు గ్రామాల్లో పర్యటించి బైక్ ర్యాలీల ద్వారా ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు.

ఈ సందర్భంగా కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను ప్రజలకు పరిచయం చేస్తూ వారి విజయానికి మద్దతు ఇవ్వాలని ఓటర్లను కోరారు. గ్రామాల అభివృద్ధి, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందాలంటే స్థానిక సంస్థల్లో కూటమి అభ్యర్థులు గెలుపొందడం ఎంతో అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు రహదారుల అభివృద్ధి, సురక్షిత తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ గ్రామస్థాయిలో చేరాలంటే ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం మధ్య సమన్వయం ఎంతో కీలకమని వివరించారు. స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించే బాధ్యత గ్రామస్థాయి ప్రజాప్రతినిధులపై ఉంటుందని అన్నారు.

గ్రామాల సమగ్ర అభివృద్ధికి సమర్థవంతమైన నాయకత్వం అవసరమని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే అభ్యర్థులను ఎన్నుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు.

ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన బైక్ ర్యాలీలకు కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఎన్నికల ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొని కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని వారు తెలిపారు.

సర్పంచ్ గా అవకాశం ఇచ్చారు సేవ చేసి చూపిస్తాం

- సర్పంచ్ మాదారపు పార్వతి తాతాజీ

కాకినాడ (మనసులో మాట) నవంబర్ 27

కాకినాడ రూరల్ సర్పంచ్ గా అవకాశం ఇచ్చారు ఇక సేవ చేసి చూపిస్తాం అని మాజీ ఏ ఏం సి చైర్మన్ కర్రి వెంకట్రాజు తిమ్మాపురం పంచాయతీ కార్యాలయంలో జరిగిన కౌంటింగ్ కేంద్రం వద్ద గెలిచిన అనంతరం ఆనందోత్సాహంతో ఆయన మాట్లాడారు. అనంతరం సర్పంచ్ గా భారీ మెజారిటీ తో విజయం సాధించిన మాదారపు పార్వతి తాతాజీ మాట్లాడుతూ 2,500 మెజారిటీ ఇచ్చిన ఈ నా గ్రామ ప్రజలకు అంకితం అని మీకు సేవకుడే పని చేస్తానని, గత 25 ఏళ్లగా గ్రామంలో శిధిలమైన పాత డ్రైన్ స్థానంలో కొత్త డ్రైన్ లు రీప్లేస్ చేస్తానని తిమ్మాపురం చరిత్ర లో ఎప్పుడు వన్ సైడ్ తీర్పు చూడలేదని ఇప్పుడు 14 వార్డులు క్లీన్ స్వీప్ చేసి పంచాయతీ పాలకవర్గంలో విజయ పతాకం ఎగరవేశామని ఇది మీ విజయమని మాకు మా ప్యానెల్ కు విజయానికి సహకరించిన ఎమ్మెల్యే పంతం నానాజీ కు, గ్రామస్తులకు కూటమి నాయకులకు ఎంపీటీసీలు బత్తుల గణేష్ దొరబాబు ఎల మంచిలి అమ్మాజీ కార్యకర్తల కు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నా అన్నారు



కనకదాసు ఆశయాలు, బోధనలు సమాజానికి స్ఫూర్తిదాయకం

- కాకినాడ కలెక్టరేట్ లో ఘనంగా కనకదాసు జయంతి వేడుకలు
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

కాకినాడ (మనసులో మాట) నవంబర్ 27



ప్రముఖ భక్తి కీర్తనకారుడు, తత్వవేత్త,వాగ్గేయ కారుడు, సంఘ సంస్కర్త కనక దాసు జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ కనకదాసు 517 వ జయంతిని పురస్కరించు కొని కనకదాసు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగానివాళులర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడు తూ కనకదాసు తన రచనలు, కీర్తనల ద్వారా సమాజంలో నెలకొన్న కులమత భేదాలు, సామాజిక అసమానతలను ప్రశ్నిస్తూ సమానత్వం,మానవత్వం, భక్తి మార్గం యొక్క గొప్పతనాన్ని చాటిచెప్పారనికొనియాడారు. సమాజం లో ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం,అవకాశాలు దక్కాలనే ఉన్నత సందేశాన్ని ఆయన తన బోధనల ద్వారా ప్రజలకు అందించారని తెలిపారు.

కనకదాసు కర్ణాటకకు చెందిన గొప్ప కవిగా తత్వవేత్తగా దాస సాహిత్యానికి,కర్ణాటక సంగీ తానికి విశేష సేవలందించారని జిల్లా కలెక్టర్ తెలిపారు.మోహన తరంగిణి రామధాన్య చరిత్ర హరిభక్తిసార వంటి మహాకావ్యాల ద్వారా ప్రజల్లో భక్తి, నీతి, సామాజిక చైతన్యాన్నిపెంపొందించారని వివరించారు.తన కీర్తనల్లో కాగినెలె ఆదికేశవ అనే అంకిత నామాన్ని ఉపయోగిస్తూ భక్తి తత్వాన్ని విశ్వవ్యాప్తం చేశారన్నారు. కనకదాసు ఆశయాలు, ఆదర్శాలు నేటి ఆధునిక సమాజానికి కూడా ఎంతో ప్రశంసమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. కనకదాసు చూపిన సమానత్వం, సామాజిక సామరస్యం, మానవతా విలువల మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి. తిప్పే నాయక్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఏ. శ్యామలకుమారి , కార్యాలయం సూపరింటెండెంట్ కె. రాజేంద్రప్రసాద్ సహాయ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కె రామకృష్ణ కలెక్టరేట్ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొని కనకదాసు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు

రెండవ దశ గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారం నేటితో ముగింపు

- కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్

కాకినాడ (మనసులో మాట) నవంబర్ 27



కాకినాడ జిల్లా లో రెండవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్న 8 మండలాల్లో ఎన్నికల ప్రచారం నేటి శుక్రవారం సాయంత్రం 5 గంటలతో ముగిసిందని, ఇకపై ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎలాంటి ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదని జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ స్పష్టం చేశారు. రెండవ దశలో పెదపూడి, కాజులూరు, గొల్లప్రోలు, పిఠాపురం, యు. కొత్తపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి మండలాల్లోని మొత్తం 149 గ్రామ పంచాయతీలకు గాను 20 గ్రామాలు ఏకగ్రీవం కాగా మిగిలిన 129 గ్రామ పంచాయతీ లకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు.

ఎన్నికలు ప్రశాంతంగా పారదర్శకంగా నిర్వహించేందుకు ఆయా మండలా ల్లోని గ్రామాల్లో పటిష్ట మైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, రేపటి నుంచి పోలింగ్ కేంద్రాల పద్ద పోలీసు బలగాలను మోహరించనున్నట్లు తెలిపారు. సమస్యాత్మక గ్రామాలు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున అభ్యర్థులు రాజకీయ నాయకులు ప్రజలు నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని, ఎన్నికలు జరిగే ప్రాంతాలతో సంబంధం లేని ఇతర ప్రాంతాల వ్యక్తులు వెంటనే ఆ ప్రాంతాలను విడిచి వెళ్లాలని సూచించారు. ఎన్నికల ప్రచార నిషేధాన్ని ఉల్లంఘించడం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడటం వంటి చర్యలను ఉపేక్షించేది లేదని, నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ బిందు మాధవ్ హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు, ఒత్తిళ్లకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించు కునేలా జిల్లా పోలీసు శాఖ అన్ని చర్యలు తీసుకుంటోందని జిల్లా ఎస్పీ తెలిపారు.

గోకవరం మండలంలో 131 పోస్టల్ బ్యాలెట్ల పోలింగ్

గోకవరం (మనసులో మాట) నవంబర్ 27



రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలు-2026 నిర్వహణలో భాగంగా గోకవరం మండలంలోని 14 గ్రామపంచాయతీల పరిధిలో శుక్రవారం పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన ఈ పోలింగ్‌లో మొత్తం 131 పోస్టల్ బ్యాలెట్లు పోలైనట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి గోవింద్ తెలిపారు. గ్రామపంచాయతీల వారీగా గోకవరంలో అత్యధికంగా 43 పోస్టల్ బ్యాలెట్లు పోలవగా, గుమ్మళ్లదొడ్డిలో 6, తంటికొండలో 4, తిరుమలాయపాలెంలో 9, అచ్చుతాపురంలో 7, వెదురుపాకలో 2, కొత్తపల్లిలో 8, కామరాజుపేటలో 18, మల్లవరంలో 10, రంప యర్రంపాలెంలో 11, కృష్ణునిపాలెంలో 7, ఇటికాయలపల్లిలో 2, గాదెలపాలెంలో 4 పోస్టల్ బ్యాలెట్లు పోలయ్యాయి. గంగంపాలెంలో ఒక్క పోస్టల్ బ్యాలెట్ కూడా పోలవలేదు. పోలైన పోస్టల్ బ్యాలెట్లను సంబంధిత గ్రామపంచాయతీల స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారులకు పంపించినట్లు ఎంపీడీవో వెల్లడించారు. ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కించిన అనంతరం సాధారణ బ్యాలెట్ పత్రాల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు

గోకవరం అభివృద్ధే లక్ష్యం.. ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే ధ్యేయం



- మంచం గుర్తుపై ఓటు వేసి పదిలం కనకలక్ష్మిని గెలిపించండి
- పదిలం కనకలక్ష్మి విజయానికి కంబాల విస్తృత ప్రచారం

గోకవరం (మనసులో మాట) నవంబర్ 27

గోకవరం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్ది, అభివృద్ధికి చిరునామాగా నిలుపుతామని విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ1 కంబాల శ్రీనివాసరావు అన్నారు. గోకవరం గ్రామ సర్పంచ్ అభ్యర్థి పదిలం కనకలక్ష్మి మురళిని మంచం గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ గురువారం గ్రామంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా తొలుత ఆరవ పేట, పాత అంబేద్కర్ కాలనీల్లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామంలోని పలు వీధులు, కాలనీల్లో పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఎన్నికల కరపత్రాలను పంపిణీ చేస్తూ సర్పంచ్ అభ్యర్థి పదిలం కనకలక్ష్మి మురళికి మద్దతు తెలపాలని, మంచం గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ గోకవరం గ్రామ సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, ఎన్నికల్లో విజయం సాధించిన వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అన్ని రంగాల్లో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ, గతంలో ఎన్నడూ జరగని రీతిలో అభివృద్ధి చేసి చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. గోకవరం అభివృద్ధికి ప్రజలంతా సహకరించి పదిలం కనకలక్ష్మి మురళికి మంచం గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు

కొత్తపల్లిలో కూటమి అభ్యర్థికి మద్దతుగా ఎంపీపీ హేమశైలుబాబు ప్రచారం

గోకవరం (మనసులో మాట) నవంబర్ 27

గోకవరం మండలం కొత్తపల్లి గ్రామంలో సర్పంచ్ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈ నేపథ్యంలో ఎంపీపీ జనపరెడ్డి హేమశైలు బాబు గ్రామంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ అభ్యర్థితో కలిసి గ్రామంలోని వీధివీధికి వెళ్లి ప్రజలను కలుసుకుంటూ ప్రచారం సాగించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామాభివృద్ధికి మరింత కృషి చేస్తామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవలందిస్తూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల

- **నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి**
- **ఈ నెల 29న పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలను ఎన్నికల**
- **పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్ల పై అధికారులకు దిశానిర్దేశం**
- **జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్**

కాకినాడ (మనసులో మాట) నవంబర్ 27



రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ,ఎన్నికల నిబంధనల మేరకు ప్రశాం తంగా,పారదర్శకంగా నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ముందస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్న రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు,ఉపసర్పంచ్ ఎన్నిక ప్రక్రియలకు సంబంధించి శుక్రవారం స్థానిక కలెక్ట రేట్ నుంచి మండల స్థాయి అధికా రులతో వీడియో కాన్ఫ రెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీ వోలు, ఎన్నికల విధులు నిర్వ హించే ఇతర అధికారులకు ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు కీలక సూచనలు,ఆదేశాలు జారీ చేసి దిశా నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెండవ విడత ఎన్నికల్లో భాగంగా ఈ నెల 29వ తేదీన ఉ. 7 గంటల నుంచి మ. 1.00 గంట వరకు పోలింగ్ నిర్వహించాలని, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారం భించి పూర్తయ్యే వరకు కొనసాగించాలని తెలిపారు.కౌంటింగ్ పూర్తయిన వెంటనే నిబంధనల ప్రకారం ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహిం చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.

పోలింగ్ సామగ్రి, ఓటర్ల జాబితాలపై ప్రత్యేక శ్రద్ధ

పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఓటరు స్లిప్పుల పంపిణీ ముందు గానే పూర్తి చేయాలని, రెండు కంటే ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్నప్రాంతాల్లో ఓటర్లకు సహాయ పడేందుకు హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు.

పోస్టల్ బ్యాలెట్ల ఆధారంగా రూపొందించిన మార్క్‌డ్ కాపీలను పోలింగ్ స్టేషన్ల వారీగా సిద్ధం చేసి అందు బాటు లో ఉంచాలన్నారు. అబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డూప్లికేట్ ఓటర్ల జాబితాలను పోలింగ్ స్టేషన్ల వారీగా రూపొందించి సంబంధిత సిబ్బందికి అందజేయాలని ఆదే శించారు. ఫారం9లో సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థుల పేర్లు, ఎన్నికల గుర్తులు సక్రమంగా ఉన్నాయో లేదో క్షుణ్ణంగా పరిశీలించి, స్పష్టంగా రాసి పోలింగ్ కేంద్రాల వెలుపల ప్రదర్శించాలన్నారు. బ్యాలెట్ పేపర్లలో అభ్య ర్థుల పేర్లు, గుర్తులు, ముద్రణ వివరాలను ప్రతి పేజీలో జాగ్రత్తగా తనిఖీ చేయాలని, పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా సంబంధిత వార్డు లకు బ్యాలెట్ పేపర్లు పంపిణీ చేయాలని సూచించారు. పేపర్ సీల్స్, ఇతర పోలింగ్ సామగ్రిని కూడా ముందుగానే పరిశీలించి ఎటు వంటి కొరత లేకుండా చూసు కోవాలన్నారు.

డిస్పాచ్ ఏర్పాట్లు, సిబ్బంది నిర్వహణ

గత ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం పోలింగ్ కేంద్రాల సంఖ్య గణనీయంగా పెరిగినందున అందుకు అనుగుణంగా డిస్పాచ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ సిబ్బంది హాజరు నమోదు, సామగ్రి పంపిణీకి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని,విధులకు హాజరైన వారు, గైర్హాజరైన వారి వివరాలను స్పష్టంగా నమోదు చేయాలన్నారు.

పోలింగ్ బృందాలు బయలు దేరిన అనంతరం మిగిలే రిజర్వ్ పోలింగ్ అధికారులు ఇతర పోలింగ్ అధికారులు మరుసటి రోజు ఉదయం 6 గంటలకు తప్పని సరిగా రిపోర్ట్ చేయాలని ఆదేశిం చారు. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన పోలింగ్ కేంద్రాలకు వారిని వెంటనే పంపించేలా సిద్ధంగా ఉంచాలన్నారు.

పోలింగ్ సిబ్బందికి టీ, బిస్కెట్, భోజనం, రాత్రి భోజనం అందించే బాధ్యతను పంచాయతీ కార్యదర్శులు సమన్వ యంతో నిర్వహించాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలి.

పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు, ఓటర్ల రహస్య ఓటింగ్, గోప్యతకు సంబంధించిన ఏర్పాట్లు, ఓటింగ్ కంపా ర్ట్‌మెంట్లను తనిఖీ చేయాలని తెలి పారు. ఎన్నికల ఏజెంట్లకు అవసర మైన గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో బెంచీలు, ఫర్నిచర్, తగిన లైటింగ్, ఫ్యాన్లు, తాగునీరు, రన్నింగ్ వాటర్, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని, అవసరమైన చోట్ల షామియానాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

పోలింగ్ రోజున ఉదయం 6.30 గంటలకు సీలింగ్ ప్రక్రియ ప్రారంభించి, ఉదయం 7 గంటలకు కచ్చితంగా పోలింగ్ ప్రారంభమయ్యేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయా లన్నారు. జోనల్ మెజిస్ట్రేట్లు, మండల స్థాయి అధికారుల ఫోన్ నంబర్లను ప్రిసైడింగ్ అధికారులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు.

కౌంటింగ్ ప్రక్రియను నిబంధనల మేరకు నిర్వహించాలి

మధ్యాహ్నం 1 గంటకు పోలింగ్ ముగింపు సమయంలో క్యూలో ఉన్న ఓటర్లకు నిబంధనల ప్రకారం టోకెన్లు జారీ చేసి, వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పించాలని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ పూర్తయిన అనంతరం సిబ్బంది మధ్యాహ్నం 2 గంటలకు కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, వీలైనంత త్వరగా మధ్యాహ్నం 2 లేదా 2.30 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఓటు హక్కు వినియోగించు కున్న ప్రజలు పోలింగ్ అనంతరం ఇళ్లకు వెళ్లేలా అవగాహన కల్పించాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి పొందిన అభ్యర్థి, ఒక ఏజెంట్‌ను మాత్రమే నిబంధనల ప్రకారం అనుమతించాలన్నారు.

స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారులు నిర్ణయాలు తీసుకునే విషయంలో స్పష్టతతో, వేగంగా వ్యవహరించాలని తెలిపారు.చెల్లుబాటు అయ్యే,చెల్లని ఓట్ల గుర్తింపుపై ముందుగానే అభ్యర్థులు,ఏజెంట్ లకు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రతి రౌండ్ కౌంటింగ్ వివరాలపై సంబంధిత సంతకాలు తీసుకోవాలన్నారు.అన్ని కౌంటింగ్ టేబుళ్ల సిబ్బంది చేరుకునే వరకు వేచి ఉండ కుండా, సిద్ధంగా ఉన్న టేబుళ్ల వద్ద ఓట్ల లెక్కింపు ను ప్రారంభించాలని సూచించారు.

సర్పంచ్ ఓట్ల లెక్కింపును సాధ్యమైనంత త్వరగా, సాయంత్రం 6 గంటల లోపు పూర్తి చేసి ఫలితాలను ప్రకటించడంతో పాటు ఎన్నికల నిబంధనల ప్రకారం గెలుపొందిన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని ఆదేశించారు.

డేటా ఎంట్రీ, వీడియోగ్రఫీపై అప్రమత్తంగా ఉండాలి.ఎన్నికల ఫలితాలు, ఇతర వివరాలను స్వర్ణ పంచాయతీ పోర్టల్‌తో పాటు జిల్లా స్థాయిలో రూపొందించిన గూగుల్ ఫారంలోఎటువంటి తప్పులు లేకుండా వేగంగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. డేటా ఎంట్రీ చేసిన వివరాలను మరొక అధికారి ద్వారా క్షుణ్ణంగా తనిఖీ చేయించి, సంతకం తీసుకున్న తర్వాతే అధికారికంగా ప్రకటించాలన్నారు.

కౌంటింగ్ కేంద్రాల్లో నిరంతర వీడియో గ్రఫీ నిర్వహించేందుకు స్టాండ్ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో సీలింగ్ ప్రక్రియ, ముఖ్యమైన ఘటనలు, సమస్యలు, ఇతర కీలక పరిణామాలను వీడియోలో నమోదు చేయాలన్నారు. ఈ ఫుటేజీని నిబంధనల ప్రకారం భద్రపరిచి నేరుగా ఎంపీడీవోలకు అందజే యాలని, అనధికారికంగా బయటకు పంపరాదని స్పష్టం చేశారు.విద్యుత్ అంతరాయం ఏర్పడినా కౌంటింగ్ ప్రక్రియకు ఆటంకం కలగకుండా డీజిల్, జనరేటర్లు, మెకానిక్, ఎలక్ట్రీషియన్ అందు బాటులో ఉండేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు.కౌంటింగ్ కేంద్రాల్లో జనస మూహాల నియంత్రణ, ఫలితాలు, ఇతర ప్రకటనల కోసం పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలన్నారు.

మూడవ విడత ఎన్నికల శిక్షణకు సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలి

మూడవ విడత ఎన్నికలు నిర్వహించనున్న మండలాల్లో పోలింగ్ అధికారులు ఇతర పోలింగ్ అధికారులకు విధుల కేటాయింపు ఉత్తర్వులు అందినట్లు ఫోన్ ద్వారా నిర్ధారించు కోవాలని కలెక్టర్ ఆదేశించారు. శిక్షణ కార్యక్రమానికి సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు. శిక్షణకు గైర్హాజరయ్యే సిబ్బంది వివరాలను వెంటనే నివేదించి, నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో ప్రతి అధికారి తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వర్తించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను పూర్తిస్థా యిలో పాటిస్తూ పోలింగ్ నుంచి కౌంటింగ్, ఉప సర్పంచ్ ఎన్నిక వరకు ప్రతి దశను అప్రమత్తంగా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జడ్పీ సి ఈ ఓ లక్ష్మణరావు డిపిఓ రవికుమార్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

ఎన్నికల సిబ్బందికి భోజన ఏర్పాట్లలో నిర్లక్ష్యం.. ఎంపీడీవో సస్పెన్షన్

- **జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్**

రంపచోడవరం(మనసులో మాట) నవంబర్ 27:

పోలవరం జిల్లా రంపచోడవరం ఎన్నికల విధులకు హాజరైన సిబ్బందికి భోజనం, అల్పాహారం, కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహించిన రంపచోడవరం ఎంపీడీవో పి.వి.వి.ఎస్. ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. నవంబర్ 25న ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద విధులకు హాజరైన సిబ్బందికి భోజనం, అల్పాహారం అందించకపోవడంతో ఖాళీ ప్లేట్లతో ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన ఘటనపై కలెక్టర్ తీవ్రంగా స్పందించారు.అనంతరం సిబ్బంది ఎన్నికల సామగ్రితో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్లినట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు.ఎన్నికల సిబ్బందికి అవసరమైన భోజనం, అల్పాహారం, కనీస వసతులు కల్పించడంతో పాటు ఎన్నికల ఏర్పాట్లను సమన్వయం చేయడం, పర్యవేక్షించడం ఎంపీడీవో బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం కారణంగా సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొనడం, నిరసన వ్యక్తం చేయడం ఎన్నికల యంత్రాంగానికి ఇబ్బందికర పరిస్థితి కలిగించిందన్నారు.ఈ ఘటనపై ఇప్పటికే సంజాయిషీ నోటీసు జారీ చేసి వివరణ కోరినట్లు తెలిపారు. ఘటన తీవ్రత, అధికారుల బాధ్యతలు, తదుపరి క్రమశిక్షణా విచారణ అవసరాన్ని పరిగణనలోకి తీసుకుని ఏపీ సివిల్ సర్వీసెస్ క్లాసిఫికేషన్, కంట్రోల్ అండ్ అప్పీల్ నిబంధనలు-1991లోని రూల్ 8(1), రూల్ 13 ప్రకారం ఎంపీడీవోను తక్షణమే అమలులోకి వచ్చేలా సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు.సస్పెన్షన్ కాలంలో ఆయన ప్రధాన కార్యస్థానంగా పోలవరం జిల్లా జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి కార్యాలయాన్ని నిర్ణయించారు. ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యస్థానాన్ని విడిచి వెళ్లరాదని, తన వద్ద ఉన్నప్రభుత్వ రికార్డులు, ఫైళ్లు, రిజిస్టర్లు, ఎన్నికల పత్రాలు, సామగ్రి, ఇతర బాధ్యతలను నియమిత అధికారికి అప్పగించాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం జీవనాధార భత్యం పొందేందుకు అర్హత ఉంటుందని, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు సస్పెన్షన్ కొనసాగుతుందని తెలిపారు.ఈ వ్యవహారంపై తదుపరి క్రమశిక్షణా చర్యలు చేపట్టేందుకు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి



కి ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

రెండో విడత పంచాయతీ ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు..



పిఠాపురం, (మనసులో మాట) నవంబరు 27:

నియోజకవర్గ వ్యాప్తంగా ఈ నెల 29న జరగనున్న రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల బందోబస్తు ఏర్పాట్ల పై కాకినాడ డి.ఎస్.పి ఎన్. వి.ఎస్.కె. దుర్గారావు శుక్రవారం పిఠాపురం సర్కిల్ కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్షించారు. ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా జరిగేలా రౌడీషీటర్లు, అల్లరి మూకలపై నిఘా ఉంచాలని, సమస్యాత్మక గ్రామాల్లో అదనపు బలగాలను మోహరించాలని ఆదేశించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రత, బారికేడ్లు, విద్యుత్ వెలుతురు ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పిఠాపురం సీఐ జి.వి.వి. సత్యనారాయణ, సబ్‌ఇన్‌స్పెక్టర్లు వి. మణికుమార్, ఎన్. రామకృష్ణ, జి. వెంకటేష్, ఎస్. కె. జాన్ బాషా పాల్గొన్నారు.

రీసర్వే పెండింగ్ పనులు గడువులోగా పూర్తి చేయాలి



- **జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్**

రంపచోడవరం (మనసులో మాట) నవంబర్ 27.....

పోలవరం జిల్లాలో సమగ్ర భూ రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ హాలులో జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, సబ్ కలెక్టర్లు పృథ్వీ రాజ్ కుమార్, నరేంద్ర పడల్‌తో కలిసి రీ సర్వే పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మండలాల వారీగా రీసర్వే పనుల పురోగతి, తహసీల్దార్, సబ్ కలెక్టర్, జాయింట్ కలెక్టర్ లాగిన్ ప్రక్రియలు, భౌతిక రికార్డుల పరిశీలన, పెండింగ్ గ్రామాల వివరాలను సమీక్షించారు.జిల్లాలో 157 గ్రామాలకు సంబంధించి తహసీల్దార్ లాగిన్, 107 గ్రామాలకు సంబంధించిన సబ్ కలెక్టర్ లాగిన్ పురోగతితో పాటు జాయింట్ కలెక్టర్ లాగిన్ ప్రక్రియను అధికారుల వారీగా పరిశీలించారు. పెండింగ్ గ్రామాల్లో రీసర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, గ్రామాల వారీగా భూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన సవరణలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. సర్వేకు సంబంధించిన ఈకేవైసీ ప్రక్రియ,సర్వే నంబర్ల ఆధారంగా రికార్డుల పరిశీలన, వివరాల అప్‌లోడ్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు.అటవీ భూములు, ప్రభుత్వ భూముల సరిహద్దులను క్షుణ్ణంగా సర్వే చేసి స్పష్టంగా నిర్ధారించాలని, రీసర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.సమావేశంలో సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణం రాజు,డిప్యూటీ సర్వే ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, తహసీల్దార్లు సీహెచ్ బాలాజీ, అమ్మాజీ, సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి ఏ. సత్యనారాయణ, ఈడీఎం నగేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహ రహిత పోలవరం జిల్లాగా తీర్చిదిద్దాలి

- **చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్' కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్**



రంపచోడవరం (మనసులో మాట) నవంబర్ 27:

పోలవరం జిల్లా రంపచోడవరం

పోలవరం జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ పిలుపునిచ్చారు.శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ హాలులో అంతర్జాతీయ బాల్య, బలవంతపు వివాహాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా 'చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్' కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు వి. గాంధీబాబు, జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్, సబ్ కలెక్టర్లు పృథ్వీ రాజ్ కుమార్, నరేంద్ర పడల్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపడంతో పాటు బాలికల విద్య, ఆరోగ్యం, మానసిక వికాసానికి ఆటంకం కలిగిస్తాయన్నారు. బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, గ్రామస్థాయిలో వాటి అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం అందితే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని, ప్రతి బాలబాలికకు విద్య, సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే వెంటనే పోలీస్ లేదా ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. బాలికలు ఉన్నత విద్య అభ్యసించి అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని, బాల్య వివాహాల వల్ల దేశ అభివృద్ధికి ఆటంకం కలుగుతుందన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు వి. గాంధీబాబు మాట్లాడుతూ ప్రతి బాలికకు విద్య, ఆరోగ్యం, భద్రత కల్పించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తోందన్నారు. బాలికల చదువు మధ్యలో ఆగకుండా పాఠశాల విద్య పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో బాలల పరిరక్షణ కమిటీలు, మహిళా సంఘాలు, యువజన సంఘాల భాగస్వామ్యంతో ముందస్తు నిఘా ఏర్పాటు చేయాలన్నారు. బాల్య వివాహాల నుంచి రక్షించిన బాలికలకు విద్య, ఆరోగ్యం, మానసిక సహాయం, పునరావాసం కల్పించాలని తెలిపారు.ఎలెక్ట్ సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని, 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా బాల్య వివాహాల నిర్మూలన ప్రతిజ్ఞ చేయించి, పోస్టర్లను ఆవిష్కరించారు.కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. ఉమా, సబ్ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎలెక్ట్ సంస్థ అధికారి శ్యామ్ కుమార్, ప్రాజెక్ట్ మేనేజర్ మంగతాయారు, మహిళా సంఘాల సభ్యులు, వివిధ పాఠశాలల బాలికలు, సిబ్బంది పాల్గొన్నారు

ఉప్పాడ, పొన్నాడ పంచాయతీల్లో 'జబర్దస్త్' నటుల ప్రచార సందడి

పిఠాపురం /యు. కొత్తపల్లి (మనసులో మాట), నవంబరు 27:

యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎంపీపీ గంటా విజయ్ కుమార్ సతీమణి గంటా సత్యవతి తరఫున జబర్దస్త్ ఫేమ్ రైజింగ్ రాజు శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు. ఉప్పాడ పంచాయతీ పరిధిలోని కొత్తపట్నం, మాయాపట్నం గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలిశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో ఉప్పాడ పరిధిలోని సమస్యలన్నింటినీ పరిష్కరించి గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపిస్తామని, 'ఉంగరం' గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని సత్యవతి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

మరోవైపు అదే మండలంలోని పొన్నాడ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి పల్లెటి బాపన్న దొర తరఫున జబర్దస్త్ ఫేమ్ గెడ్డం నవీన్, వినోదిని విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జబర్దస్త్ కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతో ఎన్నికల సందడి నెలకొంది. ఆదివారం జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లు ఎవరికి పట్టం కడతారో వేచి చూడాలి.



సాయంత్రం కోర్టు సెషన్ లు వద్దంటూ న్యాయవాదుల ఆందోళన..

పిఠాపురం, (మనసులో మాట) నవంబరు 27:

కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ప్రకటించిన సాయంత్రం పూట కోర్టులు ఏర్పాటు ప్రతిపాదనకు వ్యతిరేకంగా పిఠాపురంలో న్యాయవాదులు శుక్రవారం మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక కోర్టు దగ్గర నుండి మొదలుకొని చర్చి సెంటర్, మున్సిపల్ సెంటర్, కోట గుమ్మం సెంటర్ల మీదుగా స్థానిక తహసిల్దార్ కార్యాలయానికి చేరుకుని ఆందోళన నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ట్రెజరర్ రాజేశ్వరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా సాయంకాలం కోర్టులు ఏర్పాటు ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని కో న్యాయవాదులుగా కోరుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) జిల్లా ఉపాధ్యక్షులు గుదిమెళ్ళ శ్రీ భాస్కరాచార్యులు మాట్లాడుతూ ఈవినింగ్ కోర్టులు ఏర్పాటు చేయడం వల్ల న్యాయవాదుల పై ఒత్తిడి, పని భార పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టులో పెండింగ్ కేసులు పరిష్కారం కోసం సాయంకాలం పూట కోర్టులు ఏర్పాటు చేయబోతున్నట్లు కేంద్ర మంత్రి ప్రకటించడం ప్రజలను తప్పుదారి పట్టించడం కోసమే అన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారం పై నిజంగా చిత్తశుద్ధి ఉంటే ముందుగా ట్రయల్ కోర్టులలో కేసులు పెండింగ్ ఉన్నచోట కొత్తగా శాశ్వత ప్రాతిపదిక న కోర్టులు ఏర్పాటు, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, మొబైల్ కోర్టులు ఏర్పాటు చేయవచ్చని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది పోస్టులు భర్తీ చేయా లని, కోర్టులలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. సీనియర్ న్యాయవాది అని శెట్టి కాశీ విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టుగా సాయంకాలం పూట కోర్టుల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఎన్నుకుందన్నారు. ఇక్కడ అమలుతీరుని బట్టి దేశమంతా అమలు చేయాలని భావిస్తున్నారని తెలిపారు. న్యాయవాదుల ఆందోళన దృష్టిలో ఉంచుకొని, రాష్ట్ర బార్ కౌన్సిల్, న్యాయవాద సంఘాలతో, బార్ అసోసియేషన్ లతో సంప్రదించకుండా ఏకపక్షంగా సాయంకాలం పూట కోర్టులు ఏర్పాటు ప్రక్రియకు వెళ్ళవద్దని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు చెప్పారు. కావున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సాయంత్రం పూట కోర్టులు ఏర్పాటు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు గౌతు రాజా, మొగిలి సుబ్బారావు, బోనం వెంకటలక్ష్మి, వి అచ్యుత్ కుమార్, పిల్లి రవికుమార్, సువర్ణ పాల్గొన్నారు,

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

అర్హులైన రైతులందరూ పంటల బీమాలో నమోదు కావాలి

- **రైతులకు అవగాహన కల్పించి గడువులోగా బీమా చేయించాలి.. కలెక్టర్ వెట్రిసెల్వి**

ఏలూరు, నవంబర్ 27(మనసులో మాట)



జిల్లాలోని అర్హులైన రైతులందరూ పంటల బీమా పథకాల్లో నమోదు అయ్యేలా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, పునర్వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాలకు సంబంధించిన గోడపత్రికలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ భూమి కలిగిన రైతులతో పాటు అర్హులైన కౌలు రైతులు కూడా పంటల బీమా పథకాలను వినియోగించుకోవచ్చని తెలిపారు.

ఈ పథకం కింద వరి, మొక్కజొన్న, పెసర, మినుము పంటలకు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. వరి పంటకు ఎకరాకు రూ.500 ప్రీమియం చెల్లిస్తే రూ.41 వేల బీమా పరిహారం లభిస్తుందని, డిసెంబర్ 31వ తేదీలోగా నమోదు చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్న పంటకు ఎకరాకు రూ.483 ప్రీమియం చెల్లిస్తే రూ.42 వేల బీమా వర్తిస్తుందన్నారు. పెసర, మినుము పంటలకు ఎకరాకు రూ.60 ప్రీమియంతో రూ.20 వేల బీమా పొందవచ్చని, ఈ పంటలకు డిసెంబర్ 15వ తేదీలోగా నమోదు చేసుకోవాలని తెలిపారు.పునర్వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం మామిడి, జీడిమామిడి పంటలకు వర్తిస్తుందని కలెక్టర్ తెలిపారు. మామిడి పంటకు ఎకరాకు రూ.2,250 ప్రీమియం చెల్లిస్తే రూ.45 వేల బీమా పరిహారం అందుతుందన్నారు. అకాల, అధిక వర్షపాతం, తెగుళ్లు, చీడపీడలు, వాతావరణ పరిస్థితులు, ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు, అధిక గాలివేగం కారణంగా పంట నష్టం జరిగితే నిబంధనల ప్రకారం పరిహారం అందుతుందని వివరించారు. ఈ పథకంలో డిసెంబర్ 31వ తేదీలోగా నమోదు కావాలని సూచించారు.

రైతులు ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, భూమి పాస్‌బుక్ నకళ్లు, పంట సాగు చేసినట్లు ధ్రువీకరణ పత్రం లేదా స్వీయ ధ్రువీకరణతో పాటు అవసరమైన పత్రాలను సమర్పించి బీమా పథకంలో నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. సమీప కామన్ సర్వీస్ సెంటర్, పంటల బీమా పోర్టల్, పంటల బీమా యాప్ లేదా అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ ప్రతినిధుల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆధార్ అనుసంధానమైన బ్యాంకు ఖాతా, భూ వివరాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.బ్యాంకుల నుంచి పంట రుణాలు పొందిన రైతుల ప్రీమియాన్ని బ్యాంకర్లు నిబంధనల ప్రకారం వసూలు చేస్తారని తెలిపారు. రుణ అర్హత కార్డులు కలిగిన కౌలు రైతులు కూడా బీమా పథకాలకు అర్హులని స్పష్టం చేశారు. గ్రామస్థాయిలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు రైతులకు అందుబాటులో ఉండి నమోదు ప్రక్రియలో సహకరించాలని ఆదేశించారు.

జిల్లాలో సూపర్ ఎల్‌నినో పరిస్థితుల కారణంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పుల వల్ల పంట నష్టం జరిగితే రైతులకు బీమా రక్షణ కల్పించేందుకు ఈ పథకాలు ఉపయోగపడతాయని తెలిపారు. అందువల్ల వ్యవసాయాధికారులు గ్రామాల్లో రైతులకు పంటల బీమాపై విస్తృతంగా అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి రైతు గడువులోగా బీమా పథకంలో నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.

వ్యాపారస్తులను గ్రామస్తులను స్వయంగా కలిసి కృతజ్ఞతలు తెలిపిన పంచాయతీ సర్పంచ్

- **బీర వెంకటలక్ష్మి బాలయోగి దంపతులు**

రంపచోడవరం(మనసులో మాట) నవంబర్ 27:



పోలవరం జిల్లా అడ్డతీగల గ్రామ పంచాయతీ సర్పంచ్ గా అడ్డతీగల గ్రామస్తులు వ్యాపారస్తులు అలాగే ఇతర కార్యకర్తలకు అత్యధిక మెజారిటీతో గెలిపించినందుకు కృతజ్ఞతగా పంచాయతీ సర్పంచ్ బీర వెంకట లక్ష్మి బాలయోగి దంపతులు ప్రతి షాప్ కు వెళ్లి వ్యాపారస్తులను గ్రామస్తులను స్వయంగా కలిసి వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బీర వెంకట లక్ష్మి బాలయోగి దంపతులు తమపై ఎంతో నమ్మకం ఉంచి మమ్మల్ని అత్యధిక మెజారిటీతో గెలిపించిన వ్యాపారస్తులకు గ్రామస్తులకు టిడిపి కార్యకర్తలకు తమ గెలుపుకు సహకరించిన ఇతర పార్టీ కార్యకర్తలకు అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే వీరితోపాటు గ్రామ ఉపసర్పంచ్ గా ఎన్నికైన పొడుగు సాయి కూడా గ్రామస్తులకు వ్యాపారస్తులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తమతో పాటు నెగ్గిన వార్డు సభ్యులు పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కోటనందూరు మండలంలో సర్పంచ్ పదవులకు పోటీలో ఉన్న అభ్యర్థులు వీరే

కోటనందూరు (మనసులో మాట)నవంబర్ 27



కోటనందూరు మండలంలో సర్పంచ్ పదవులకు 39 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మండలంలో 17 పంచాయతీలు ఉండగా అల్లిపూడి పంచాయతీ సర్పంచ్ పదవి ఏకగ్రీవంగా ఎన్నికయింది. ఈ గ్రామంలో సర్పంచ్ పదవితో పాటు వార్డులు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. ఈ గ్రామంలో సర్పంచ్ గా అంకంరెడ్డి బుల్లిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలో అన్ని గ్రామాలలో 174 వార్డులు ఉండగా 12 వార్డులు ఏకగ్రీవం కావడంతో 162 వార్డులకు 330 మంది వార్డు సభ్యులకు పోటీలో ఉన్నారు. మండలంలో 16 గ్రామ పంచాయతీల సర్పంచ్ బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలు.

అప్పలరాజుపేట 1. నల్లమిల్లి సూర్యకుమారి.2. సుర్ల సావిత్రి.

భీమవరపుకోట 1 శ్రీ వత్సవాయి అచ్యుతరామరాజు.2. అల్లంపల్లి నరసింహమూర్తి.3. జిగటాల వీరబాబు.

బిళ్ళనందూరు 1 పోలుపర్తి మంగ 2 లగుడు ఆదిలక్ష్మి.

బొద్దవరం 1 ఏడిద బేబీ అనిత 2 గడ్డం దేవుడమ్మ.

ఇండుగపల్లి 1 కుంచె అచ్చిరాజు 2 గాది అరుణ్ కుమార్.

జగన్నాధపురం 1 గొర్లి రమాదేవి 2 మాతిరెడ్డి జయలక్ష్మి 3 మాతిరెడ్డి మంగ.

కే ఏ మల్లవరం 1 ఉడతపల్లి సత్యనారాయణ 2 కాపారపు దేవుడు.

కే ఈ చిన్నయ్యపాలెం 1 అంకంరెడ్డి శ్రీలక్ష్మి 2 లాలం సృజన.

కే కొట్టాం 1 చిటికెల అచ్చుతాంబ 2 లగుడు జానకి 3 లగుడు ఎర్రయమ్మ.

కే ఓ అగ్రహారం 1 జిగటాల వినీల 2. జిగటాల దేవి కాకరాపల్లి 1 వాసం పద్మ 2 లంక వర్ష 3 వాసం వెంకటలక్ష్మి 4 లంక సత్య.

కోటనందూరు 1 అంకారెడ్డి రాజశేషు 2 కొరుప్రోలు నాగగిరి గోవర్ధనరావు (కృష్ణ) 3 వెలగా కృష్ణారావు.

లక్ష్మీదేవి పేట 1 నర్సిపూడి నాగేశ్వరరావు 2 నర్సిపూడి గురవయ్య.

పి కొట్టాం 1 ఖుర్షీద్ అహ్మద్ ఉన్నిషా షేక్ 2 బొంగు నాగలక్ష్మి 3 పసగడుగుల సత్యవేణి.

ఎస్ఆర్ పేట 1 గుడివాడ నూకి నాయుడు 2 రుత్తల రాజేశ్వరి.

టిజే నగరం 1 సుర్ల అరుణ 2 సుర్ల సింహాచలం.

వీరు సర్పంచ్ బరిలో ఉన్నట్లు ఎంపీడీవో పి వెంకటనారాయణ మీడియా తెలియజేశారు

ఆ రెండు పంచాయతీలు "ఏకగ్రీవం"





- **గ్రామ అభివృద్ధి ప్రధాన ఎజెండా**

రౌతులపూడి(మనసులో మాట) నవంబర్ 27:

మండలంలోని ఉప్పంపాలెం రాజవరం గ్రామాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి ఉప్పంపాలెం సర్పంచిగా బచ్చ మంగ ను గ్రామస్తులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజవరం గ్రామపంచాయతీ సర్పంచ్ గా లాలం కృష్ణవేణి వెంకటరమణ గ్రామస్తులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామాల్లో ఎటువంటి అనర్థాలు రాకుండా శత్రుత్వాలు పెరగకుండా గ్రామాల అభివృద్ధి కోసం కలిసి పనిచేయడం ఆనందించితక్క విషయమని రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచులు బచ్చామంగా లాలం కృష్ణవేణి వెంకటరమణ మాట్లాడుతూ మాపై ఎంతో నమ్మకంతో మాకు ఈ బాధ్యత అప్పజెప్పిన గ్రామ ప్రజలకు మా కృతజ్ఞతలు అని గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని వారు తెలిపారు.

వైసీపీ బలపచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించండి....

- **కపిలేశ్వరపురం లో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రచారం...**

మండపేట (మనసులో మాట) నవంబర్ 27



కపిలేశ్వరపురం మండలంలోని గ్రామాల్లో వైసిపి ప్రతి బాధ్యత సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో ఆయన ఆఖరోజైనా శుక్రవారం మండలం నాగుల చెరువు తదితర గ్రామాల్లో పర్యటించి విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని వైసీపీ పార్టీ నాయకులు అభిమానులు కార్యకర్తలు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకు ఘనంగా స్వాగతం పలికారు.

బి.ఫార్మసీ చదువుతూ రాజకీయాలలోకి...

తాళ్లరేవు (మనసులో మాట), నవంబర్ 27:

బి.ఫార్మసీ చదువుతున్న ఒక యువతి రాజకీయాలలోకి వచ్చి సత్తా చాటింది. మండల పరిధిలోని ఇంజరం పంచాయతీకి చెందిన కావూరి గీతాంబిక బి.ఫార్మసీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. అయితే రాజకీయాలపై ఉన్న మక్కువ, తండ్రి ప్రోత్సాహంతోపాటు కూటమి నాయకుల మద్దతుతో గీతాంబిక ఇంజరం సర్పంచ్ అభ్యర్థిగా బరిలో దిగింది. హోరా హోరీగా సాగిన పోరులో గీతాంబిక 581 ఓట్ల మెజారిటీతో విజయం సాధించింది. తన తండ్రి తెలుగుదేశం పార్టీలో బూత్ కన్వీనర్ గా పనిచేసేవారని ఆయన ఆశయాల మేరకు రాజకీయాలలోకి వచ్చానని ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు గీతాంబిక తెలిపింది. చిన్న వయస్సులోనే గ్రామ సర్పంచ్ గా ఎన్నికైన గీతాంబికను స్థానిక నాయకులు వేగేసిన భాస్కర రాజు, ఆకెళ్ళ సుబ్బారావు, ఆకెళ్ళ నాగేశ్వరరావు, చేదూరి అరవింద్, వీర పండు, రేలంగి బాబి తదితరులు అభినందించారు.